కృష్ణా జలాల్లో రెండు పార్టీలూ అన్యాయం చేశాయి



భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

హైదరాబాద్ పెన్ పవర్: భారాస, కాంగ్రెస్ రెండు పార్టీలూ కృష్ణా జలాల్లో రాష్ట్రానికి అన్యాయం చేశాయని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ఆరోపించారు. తెలంగాణకు 512 టీఎంసీల కృష్ణా జలాలు వాటాగా రావాల్సి ఉండగా, కేవలం 299 టీఎంసీలకే అప్పటి సీఎం కేసీఆర్ సంతకం పెట్టి ఎందుకు అంగీకరించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన భాజపా రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "మెట్రో రైలు ప్రాజెక్ట్‌కు సంబంధించి అవసరమైన ప్రతిపాదనలు సక్రమంగా పంపకుండానే కేంద్రంపై నిందలు వేయడం సరికాదు. కేంద్రాన్ని విమర్శించే ముందు రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలి. సీఎం రేవంత్‌రెడ్డికి 90 స్థానాల్లో డిపాజిట్లు గల్లంతవుతాయనే భయం పట్టుకుంది. అందుకే 90 సీట్లు గెలుస్తామంటూ గొప్పలు చెబుతున్నారు. రాష్ట్రంలో భాజపా ఎదుగుదలను అడ్డుకునేందుకు మజ్లిస్ నేత

-6 లో



పార్టీ గీత దాటొద్దు...

రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డిలకు ఏఐసీసీ రాష్ట్ర నూతన ఇన్‌ఛార్జి సందీప్ స్పష్టీకరణ

తమ వివాదాస్పద వ్యాఖ్యలపై వివరణ ఇచ్చిన ఇద్దరు ఎమ్మెల్యేలు

ఏదైనా చెప్పాలనిపిస్తే తాను అందుబాటులో ఉంటానని, తనకు చెప్పాలని, సమస్యలుంటే పరిష్కరిస్తానని, పార్టీ నియమావళి గీతను దాటొద్దని ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డిలకు ఏఐసీసీ రాష్ట్ర నూతన ఇన్‌ఛార్జి బి.ఎం.సందీప్ స్పష్టం చేశారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించేలా బహిరంగ విమర్శలు చేస్తున్న వీరిద్దరినీ సోమవారం రాత్రి ప్రజాభవన్‌కు పిలిపించి ఆయన మాట్లాడారని సమాచారం. ఏఐసీసీ రాష్ట్ర కార్యదర్శి సచిన్ సావంత్ కూడా ఈ చర్చల్లో పాల్గొన్నారు. సావంత్ వీరిద్దరికీ ఫోన్ చేసి ప్రజాభవన్‌కు రావాలని, సందీప్ మాట్లాడతారని చెప్పి పిలిపించారని తెలిసింది.

హైదరాబాద్ పెన్ పవర్: వాస్తవానికి సోమవారం సాయంత్రమే సందీప్ దిల్లీకి వెళతారని ముందుగా ప్రకటించిన షెడ్యూలులో తెలిపారు. కానీ, వీరిద్దరితో మాట్లాడాలని ఏఐసీసీ నుంచి సూచనలు రావడంతో ఆయన దిల్లీ ప్రయాణాన్ని వాయిదా వేసుకుని ప్రజాభవన్ అతిథిగృహానికి వెళ్లారు. అక్కడికి వచ్చిన ఇద్దరు ఎమ్మెల్యేలతో సందీప్ విడివిడిగా గంటకు పైగా అర్ధరాత్రి వరకు మాట్లాడి అన్ని వివరాలు అడిగారని తెలిసింది. "బహిరంగంగా విమర్శలు ఎందుకు చేస్తున్నారు? పార్టీని, ప్రభుత్వాన్ని ఇబ్బందిపెట్టేలా ఎందుకు రచ్చకెక్కుతున్నారు? పార్టీ

-6 లో

- దుండిగల్ సర్కిల్-59లో హద్దు మీరుతున్న టౌన్‌ప్లానింగ్ అధికారుల అవినీతి బాగోతం..?
- 'సిఎంసి ఎస్‌టిఎఫ్ టీమ్' చర్యలు శూన్యం.. తూతూ మంత్రంగా మున్సిపల్ సిబ్బంది చర్యలతోనే మమ:..
- అక్రమ కట్టడాలకు దుండిగల్ సర్కిల్-59 అధికారుల అండదండలు అంటూ విమర్శలు..?
- ఏసీబీ దాడులు జరిగినా తీరుమారని యంత్రాంగం.. నిర్మాణంలో ఉన్న అక్రమ భవనానికి 'అనుమతులు'..
- బహదూర్‌పల్లి గ్రీన్‌హిల్స్ హౌసింగ్ కాలనీలో అక్రమ నిర్మాణాలకు బహిరంగ సహకారం..?
- మొదట రిజెక్ట్.. నిర్మాణం పూర్తయ్యాక 'బిల్డ్‌నవ్'లో ఇన్‌స్టాంట్ అనుమతులు మంజూరు..!
- పోస్ట్ వెరిఫికేషన్ పేరుతో నిబంధనలకు తిలోదకాలు..? అసలు సైట్‌కు వెళ్ళారా..? గుడ్డిగా నైట్ కొట్టారా..?
- అనుమతులు లేకుండానే అక్రమ నిర్మాణం.. 80 శాతం పూర్తయ్యాక అనుమతులకు దరఖాస్తు..!
- తొలుత రిజెక్ట్ చేసిన అధికారులు.. ఆ తర్వాత బిల్డ్‌నవ్‌లో దరఖాస్తుకు వెంటనే పర్మిషన్ మంజూరు..!
- 21-11-2026న పోస్ట్ వెరిఫికేషన్ పూర్తి.. అదే రోజు అనుమతుల మంజూరు ఎలా సాధ్యం..?
- 52 గజాల స్థలంలో "స్టిల్ట్ ప్లస్ 2 అంతస్తులు.. భవనం ముందు సెట్‌బ్యాకులు ఉన్నాయా..?
- ఇదే కాలనీలో ఇప్పటికే బిల్డర్ రవిశంకర్ 'రోడ్డు ఆక్రమణలు' నిబంధనల ఉల్లంఘన తెలిసిందే..
- కొత్తగా నర్రారాజు అక్రమ నిర్మాణం.. ఈ నిర్మాణాల వెనుక ముడుపుల ఆరోపణలు.. అధికారుల తీరుపై విమర్శలు.!
- సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదుకు సిద్ధమవుతున్న స్థానికులు..
- అక్రమ నిర్మాణాలకు అధికారుల అండతో.. నిర్మాణం పూర్తయ్యాక బిల్డ్‌నవ్ అనుమతులపై దుమారం..!

52 గజాల స్థలంలో 'స్టిల్ట్ ప్లస్ 2' అంతస్తులు..

దుండిగల్ సర్కిల్ సిఎంసి అధికారులు మంజూరు చేసిన అనుమతుల పత్రం ప్రకారం, బహదూర్‌పల్లి గ్రామం సర్వే నెంబర్ 134/పార్ట్, గ్రీన్‌హిల్స్ హౌసింగ్ కాలనీ, ప్లాట్ నంబర్ 151/పార్ట్ ఈస్ట్ సైడ్ పోర్షన్‌లో నర్రా రాజు పేరుతో 43.58 చదరపు మీటర్లు (52.1 గజాలు) స్థలానికి అనుమతులు మంజూరు చేశారు.. అంటే సుమారు 52.1 గజాల స్థలంలో స్టిల్ట్ ఫర్ పార్కింగ్‌తో పాటు రెండు పై అంతస్తుల నిర్మాణానికి పర్మిషన్ జారీ చేశారు.. ఈ ప్రక్రియను 'ఇన్‌స్టంట్ రిజిస్ట్రేషన్'గా(ఐఆర్) పేర్కొంటూ, దరఖాస్తు దారుడు సమర్పించిన స్వీయ ధ్రువీకరణ ఆధారంగా ప్రొవిజనల్ సర్టిఫికెట్ ఇచ్చినట్లు పత్రంలో ఉంది..

-4లో





ముడుపులు ముట్టితే..?

అడ్డదారుల్లో అనుమతులా..?

నాడు ధన దాహంతో నీటి ఒప్పందాలు

భారాస నేతలపై మంత్రి పొంగులేటి ధ్వజం

హైదరాబాద్ పెన్ పవర్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు నాడు ధన దాహంతో నీటి ఒప్పందాలు చేసుకుని, నిర్ణయాలు తీసుకుని.. కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని తెలంగాణ రైతులకు మరణ శాసనం రాశారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని ఆధారాలతో స్పష్టంగా చెప్పినా.. హరీశ్‌రావు తీరు మారట్లేదని, అసత్యాలు ముందు పుట్టి భారాస నేతలు తర్వాత పుట్టారని ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని టీచర్స్ కాలనీలో మంగళవారం సాయంత్రం పలు అభివృద్ధి

-6 లో





ఆటిజం పిల్లలకు ఆప్యాయత అవసరం

- సంతృప్తికరమైన బాల్యం ప్రతి బిడ్డ హక్కు
- పిల్లల పెంపకం తల్లిదండ్రుల ఉమ్మడి బాధ్యత
- కుటుంబ వివాదాల్లో సానుకూల వైఖరి అవసరమన్న హైకోర్టు

"భార్యాభర్తల మధ్య విభేదాలు, వైవాహిక బంధం విచ్ఛిన్నం కావడం వంటి పరిణామాలు... తల్లిదండ్రుల బాధ్యత నుంచి వారికి విముక్తి కలిగించవు. ఎన్ని విభేదాలు ఉన్నప్పటికీ బిడ్డలకు తగిన రక్షణ, ఆప్యాయత, అనురాగాలను అందించాలన్న స్పృహ తల్లిదండ్రులకు ఉండాలి. సంతృప్తికరమైన బాల్యం పొందే హక్కు ప్రతి బిడ్డకూ ఉంది" హైకోర్టు

హైదరాబాద్ పెన్ పవర్: తల్లిదండ్రులు... తమ వ్యక్తిగత, వైవాహిక విభేదాలు పిల్లల మానసిక అభివృద్ధికి నష్టం కలిగించకూడదని గుర్తించాలని, ముఖ్యంగా ఆటిజంతో బాధపడుతున్న పిల్లలకు ఇది మరీ అవసరమని హైకోర్టు స్పష్టంచేసింది. వారికి కేవలం వైద్యం అందించడంతో బాధ్యత తీరిపోదని.. సుపరిచితమైన వాతావరణం, స్థిరమైన దినచర్య, మానసిక భద్రత, ఆప్యాయతలు అవసరమని గుర్తుచేసింది. వైవాహిక విభేదాలున్న తల్లిదండ్రులు ఇలాంటి పిల్లల పెంపకం, మానసిక అభివృద్ధిలో వారి బాధ్యతను విస్మరించరాదంది. విడాకుల కోసం యూఏఈ కోర్టులో తన భర్త వేసిన సూట్‌పై విచారణను నిలిపివేయాలంటూ ఓ మహిళ హైదరాబాద్ కుటుంబ న్యాయస్థానంలో ఒక పిటిషన్.. ఆటిజంతో బాధపడుతున్న కుమారుడికి, తనకు నిర్వహణ ఖర్చుల కింద రూ.6 లక్షలు చెల్లించాలని మరో పిటిషన్ దాఖలు చేసి మధ్యంతర ఉత్తర్వులు పొందారు. వాటిని అమలు చేయకుండా యూఏఈలో కేసును కొనసాగించడంతో కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘనపై కుటుంబ న్యాయస్థానం సివిల్ నిర్బంధ ఉత్తర్వులను జారీ చేసింది. ఈ ఉత్తర్వులను సవాల్‌చేస్తూ భర్త హైకోర్టును ఆశ్రయించారు.

-6 లో



మృగ్గురిని మింగిన సంప్..!

- బాచుపల్లిలోని "దినేష్ ఎరిక్ అపార్ట్‌మెంట్"లో ప్రమాద ఘటన..
- మృత్యుకూపంగా మారిన సెప్టిక్ ట్యాంక్..! భద్రతా ప్రమాణాలు గాలికి..

- శుభ్రం చేసేందుకు లోపలికి దిగిన ముగ్గురు కార్మికులు మృత్యువాత..
- భద్రతా ప్రమాణాలు బేఖాతరు..? సంప్ నిర్వహణలో అపార్ట్‌మెంట్ వాసుల నిర్లక్ష్యం..?
- మురుగునీటి శుద్ధి కేంద్రంలో పని కోసం దిగితే.. ప్రాణాలే పోయాయి..!
- ముగ్గురి మృతుల కుటుంబాల్లో చీకటిని నింపిన మురుగునీటి సంప్..
- మృతులు శ్రీకాకుళం జిల్లాకు చెందిన సుమన్, పవన్, సురేష్‌గా గుర్తింపు..
- సెప్టిక్ ట్యాంక్‌లో విషవాయువుల ప్రభావమా..? నిర్వహణ లోపం, భద్రతా వైఫల్యమా..?
- మృతదేహాల తరలింపుపై బంధువులు, అపార్ట్‌మెంట్ వాసుల మధ్య తోపులాట..!
- 'హెచ్‌ఆర్ ఎన్విరో' సంస్థ యజమానిపై కేసు నమోదు చేసిన పోలీసులు..
- అపార్ట్‌మెంట్ యాజమాన్యం నిర్లక్ష్యంపైనా పోలీసుల దర్యాప్తు..!
- అపార్ట్‌మెంట్ యాజమాన్యం నిర్లక్ష్యం తేలితే చర్యలు తప్పవని బాచుపల్లి పోలీసుల హెచ్చరిక..

-5 లో





మృతుని ఫైల్‌ఫొటో..



మృతుని ఫైల్‌ఫొటో..

- దుండిగల్ సర్కిల్-59లో హద్దు మీరుతున్న టౌన్‌ప్లానింగ్ అధికారుల అవినీతి బాగోతం..?
- 'సిఎంసి ఎస్‌టిఎఫ్ టీమ్' చర్యలు శూన్యం.. తూతూ మంత్రంగా మున్సిపల్ సిబ్బంది చర్యలతోనే మమ:..
- అక్రమ కట్టడాలకు దుండిగల్ సర్కిల్-59 అధికారుల అండదండలు అంటూ విమర్శలు..?
- ఏసీబీ దాడులు జరిగినా తీరుమారని యంత్రాంగం.. నిర్మాణంలో ఉన్న అక్రమ భవనానికి 'అనుమతులు'..
- బహుదూర్‌పల్లి గ్రీన్‌హిల్స్ హౌసింగ్ కాలనీలో అక్రమ నిర్మాణాలకు బహిరంగ సహకారం..?
- మొదట రిజెక్ట్.. నిర్మాణం పూర్తయ్యాక 'బిల్డ్‌నవ్'లో ఇన్‌స్టాంట్ అనుమతులు మంజూరు..!
- పోస్ట్ వెరిఫికేషన్ పేరుతో నిబంధనలకు తిలోదకాలు..? అసలు సైట్‌కు వెళ్ళారా..? గుడ్డిగా రైట్ కొట్టారా..?
- అనుమతులు లేకుండానే అక్రమ నిర్మాణం.. 80 శాతం పూర్తయ్యాక అనుమతులకు దరఖాస్తు..!
- తొలుత రిజెక్ట్ చేసిన అధికారులు.. ఆ తర్వాత బిల్డ్‌నవ్‌లో దరఖాస్తుకు వెంటనే పర్మిషన్ మంజూరు..!
- 21-11-2026న పోస్ట్ వెరిఫికేషన్ పూర్తి.. అదే రోజు అనుమతుల మంజూరు ఎలా సాధ్యం..?
- 52 గజాల స్థలంలో "స్టిల్ట్ ప్లస్ 2 అంతస్తులు.. భవనం ముందు సెట్‌బ్యాకులు ఉన్నాయా..?
- ఇదే కాలనీలో ఇప్పటికే బిల్డర్ రవిశంకర్ 'రోడ్డు ఆక్రమణలు' నిబంధనల ఉల్లంఘన తెలిసిందే..
- కొత్తగా నర్రారాజు అక్రమ నిర్మాణం.. ఈ నిర్మాణాల వెనుక ముడుపుల ఆరోపణలు.. అధికారుల తీరుపై విమర్శలు.!
- సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదుకు సిద్ధమవుతున్న స్థానికులు..
- అక్రమ నిర్మాణాలకు అధికారుల అండతో.. నిర్మాణం పూర్తయ్యాక బిల్డ్‌నవ్ అనుమతులపై దుమారం..!

52 గజాల స్థలంలో 'స్టిల్ట్ ప్లస్ 2' అంతస్తులు..

దుండిగల్ సర్కిల్ సిఎంసి అధికారులు మంజూరు చేసిన అనుమతుల పత్రం ప్రకారం, బహదూర్‌పల్లి గ్రామం సర్వే నెంబర్ 134/పార్ట్, గ్రీన్‌హిల్స్ హౌసింగ్ కాలనీ, ప్లాట్ నంబర్ 151/పార్ట్ ఈస్ట్ సైడ్ పోర్షన్‌లో నర్రా రాజు పేరుతో 43.58 చదరపు మీటర్లు (52.1 గజాలు) స్థలానికి అనుమతులు మంజూరు చేశారు.. అంటే సుమారు 52.1 గజాల స్థలంలో స్టిల్ట్ ఫర్ పార్కింగ్‌తో పాటు రెండు పై అంతస్తుల నిర్మాణానికి పర్మిషన్ జారీ చేశారు.. ఈ ప్రక్రియను 'ఇన్‌స్టంట్ రిజిస్ట్రేషన్'గా(ఐఆర్) పేర్కొంటూ, దరఖాస్తు దారుడు సమర్పించిన స్వీయ ధ్రువీకరణ ఆధారంగా ప్రొవిజనల్ సర్టిఫికెట్ ఇచ్చినట్లు పత్రంలో ఉంది..



గ్రీన్‌హిల్స్ హౌసింగ్ కాలనీలో 26 అక్టోబర్ 2026 నాడు.. డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు సమయంలో నిర్మాణం ఇలా..



21 నవంబర్ 2026న పర్మిషన్ ఇచ్చిన సమయంలో ఇలా..ఈ ఫొటో 23-11-2026న తీసినది..

ముడుపులు ముట్టితే..? అడ్డదారుల్లో అనుమతులా..?



దుండిగల్ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన స్థానికుడు..

దుండిగల్, పెన్ పవర్, నవంబర్ 24:

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులే, పరోక్షంగా సహకరిస్తుంటే, పట్టించుకునేది ఎవరు..? తిరస్కరించిన నిర్మాణ అనుమతుల దరఖాస్తులను, కొత్తగా దరఖాస్తు చేసుకోమని చెప్పి దొడ్డిదారి అనుమతులకు అవకాశం కల్పిస్తున్న సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ దుండిగల్ సర్కిల్-59 పరిధిలో అవినీతి అధికారుల బాగోతంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. ఓవైపు కొందరు నాయకుల, సిఫార్సుల పెత్తనంతో, అధికారుల అదనపు ఆదాయానికి వరంగా మారిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.. ఇదిలా ఉండగా, దుండిగల్ సర్కిల్-59 పరిధిలో, చర్యలు తీసుకున్నా, చర్యలు తీసుకోకపోయినా..! నూటికి నూరు శాతం మున్సిపల్ వ్యాప్తంగా, అక్రమ నిర్మాణాలే దర్శనమిస్తాయని సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. నిబంధనల ప్రకారం అనుమతులు ఇవ్వాల్సిన టౌన్‌ప్లానింగ్ విభాగంలో ముడుపులు ముట్టాయంటే, అడ్డదారుల్లో అనుమతులు మంజూరు చేస్తారనే దానికి గ్రీన్‌హిల్స్ హౌసింగ్ కాలనీలోని అక్రమ నిర్మాణం ఉదాహరణగా చెప్పవచ్చు.. నిర్మాణదారులు నిబంధనలను ఉల్లంఘించి, ముందుగానే భవనాలు నిర్మించుకోవడం, ఆ తర్వాత అధికారుల చుట్టూ తిరిగి అనుమతులు పొందడం దుండిగల్ సర్కిల్-59 సిఎంసి పరిధిలో పరిపాటిగా మారింది..? అన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.. సిఎంసి బహదూర్‌పల్లి డివిజన్ గ్రీన్‌హిల్స్ హౌసింగ్ కాలనీలో సుమారు 52 గజాల స్థలంలో చేపట్టిన ఓ నిర్మాణానికి సంబంధించిన అనుమతుల వ్యవహారం ఇప్పుడు అధికారుల పనితీరుపై అనుమానాలు రేకెత్తిస్తోంది. ఎలాంటి నిర్మాణ అనుమతులు లేకుండానే భవన నిర్మాణం చేపట్టి.. సుమారు 80 శాతం పనులు పూర్తయిన తర్వాత అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.. మొదట సంబంధిత దరఖాస్తులను తిరస్కరించిన, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, తాజాగా అదే నిర్మాణానికి సంబంధించి, 'బిల్డ్‌నవ్' ఇన్‌స్టాంట్ రిజిస్ట్రేషన్ (ఐఆర్) ద్వారా, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, వర్క్ కమెన్స్‌మెంట్ లెటర్ జారీ చేయడం వెనుక ఆంతర్యమేమిటన్నది అంతుచిక్కడం లేదు. నిబంధనలను ఉల్లంఘించి చేపట్టిన అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోకుండా, నిర్మాణ అనుమతులు మంజూరు చేయడంపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు..



CYBERABAD MUNICIPAL CORPORATION BuildNow

CERTIFICATE OF REGISTRATION AND WORK COMMENCEMENT LETTER

File No: 008372/CMC/00302/IR/C59/2026 Post Verification Date: 21/11/2026

To:
Sri NARRA RAJU
R/O.H.NO.4-30/22/2,NEAR.GOVT.SCHOOL,THUMMANAPALLY VILLAGE,HUZURABAD MANDAL,KARIMNAGAR DISTRICT-505468,TELANGANA.
Telangana.

Dear Sir/Madam,

Sub: CMC - Construction of Individual Residential Building consisting of **Stilt for Parking + 2 Upper Floor** to an extent of **43.58 Sqmt** situated at Plot No: **151/PART EAST SIDE PORTION** , Locality: **GREEN HILLS HOUSING COLONY** , Survey No: **134/PART**, **Bahadurpally** Village **Medchal - Malkajgiri** District, **Dundigal Gandimaisamma** Mandal - Post Verification Completed - Certificate of Registration and Work Commencement Letter Issued- Reg.

Ref: 1. Your Provisional Certificate of Registration vide File No : **008372/CMC/00302/IR/C59/2026**
2. Post verification dt: **21/11/2026**

With reference to subject and references cited, it is to inform that you have obtained certificate of registration for construction of Individual Residential Building consisting of **Stilt for Parking + 2 Upper Floor** to an extent of **43.58 Sqmt** situated at Plot No: **151/PART EAST SIDE PORTION** , Locality: **GREEN HILLS HOUSING COLONY** , Survey No: **134/PART**, **Bahadurpally** Village, **Dundigal Gandimaisamma** Mandal, **Medchal - Malkajgiri** District - **Instant Registration** based on the self certification submitted by you and the authority has conducted the Post verification as per GHMC TG-bPASS Act. It is observed that the provisional certificate of registration obtained by you is found correct and you can proceed with the construction subject to following conditions.

1. If the abutting road width is less than 30 feet (9.00 Mts.), 15 feet (4.5 Mts.) from the center of the existing road has to be left for road widening in addition to front setback as per rule 4 (a) of G.O. Ms. No. 168 MA dt:07-04- 2012 or required area affected under Master Plan road.
2. The built up area shall be limited to the remaining plot area after leaving the road affected area and all sides setbacks.

21-11-2026 నాడు, దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల తప్పుడు పర్మిషన్..

తిరస్కరించిన నిర్మాణానికి.. అనుమతులు ఎలా సాధ్యం..?

పిల్లి కళ్ళు మూసుకుని పాలు తాగిన చందంగా తయారైంది దుండిగల్ సర్కిల్-59 సిఎంసి అధికారుల తీరు.. గ్రీన్‌హిల్స్ కాలనీ వాసులు అందించిన బిల్డ్‌నవ్ పోర్టల్ ప్రకారం, నర్రా రాజు పేరుతో ఉన్న మొదటి దరఖాస్తు ఫైల్ నంబర్ 006557/CMC/00164/IR/C59/2026కు 'Rejected' స్టేటస్ నమోదైంది.. మరో దరఖాస్తుకు సంబంధించిన ఫైల్ నెంబర్ 008372/CMC/00302/IR/C59/2026 మొదట 'Under Department Verification'గా కనిపించింది. అనంతరం ఈ రెండో ఫైల్ నెంబర్‌పై 21-11-2026న సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, వర్క్ కమెన్స్‌మెంట్ లెటర్ జారీ చేశారు. ఈ రెండు ఫైళ్ల మధ్య ఉన్న భేదం, మొదటి దరఖాస్తు తిరస్కరణకు గురికాగా.. రెండవ దరఖాస్తుకు అనుమతి కల్పించడం వంటి విధానంపై, అనుమానాలకు తావిస్తోంది.. అక్రమ నిర్మాణదారునిపై చర్యలు తీసుకోక పోగా, మరో దరఖాస్తుకు అవకాశం కల్పించడం.. పోస్ట్ వెరిఫికేషన్, ఆవెంటనే అనుమతుల మంజూరు.. ఈ మొత్తం వ్యవహారంలో ముడుపులే కారణం కావచ్చని ఆరోపణలు తలెత్తుతున్నాయి..

నిర్మాణంలో ఉన్న భవనానికి దరఖాస్తు..?

సాధారణంగా భవన నిర్మాణం చేపట్టడానికి ముందే సంబంధిత అధికారుల నుంచి అనుమతి పొందాలి. కానీ ఇక్కడ అందుకు భిన్నంగా ముందుగా నిర్మాణ పనులు చేపట్టి, దాదాపు 80 శాతం పనులు పూర్తయిన తర్వాత అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో నిర్మాణ దశలోనే దరఖాస్తును తిరస్కరించిన అధికారులు, తాజాగా నిర్మాణం పూర్తయి రంగులు వేసిన భవనానికి ఏ ప్రాతిపదికన అనుమతులు మంజూరు చేశారన్నది కీలక ప్రశ్నగా మారింది.. అప్పట్లో నిబంధనలు అడ్డొచ్చాయా..? ఇప్పుడు అవే నిబంధనలు ఎలా అనుకూలంగా మారాయి..? మధ్యలో ఏం జరిగింది..? అనే ప్రశ్నలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి.. దుండిగల్ సర్కిల్ అధికారుల విధులు, అక్రమ నిర్మాణాలకు తాకట్టు పెడుతున్నారా..? అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..

పోస్ట్ వెరిఫికేషన్ పేరుతో.. గ్రీన్ సిగ్నల్..!

గ్రీన్‌హిల్స్ కాలనీలోని అక్రమ నిర్మాణం వ్యవహారంలో అత్యంత కీలకమైన అంశం 21-11-2026న నిర్వహించినట్లు పేర్కొన్న పోస్ట్ వెరిఫికేషన్ ప్రక్రియ.. జీహెచ్‌ఎంసి టీజి-బిపాస్ చట్టం ప్రకారం అధికారులు పరిశీలించారని, దరఖాస్తుదారుడు పొందిన ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ సరైనదిగా గుర్తించినట్లు అధికారిక లేఖలో పేర్కొన్నారు.. మరోవైపు టిపిఎస్ సాయితేజని ప్రశ్నించగా ఖాళీ ప్లాటుకు మాత్రమే పర్మిషన్ ఇచ్చామని చెప్పటం గమనార్హం.. అయితే సంబంధిత అక్రమ నిర్మాణం ఇప్పటికే దాదాపు పూర్తయిందన్న స్థానికుల ఆరోపణల నేపథ్యంలో, ఈ వెరిఫికేషన్ ఏ విధంగా జరిగింది..? అధికారులు క్షేత్రస్థాయిలో భవనాన్ని పరిశీలించారా..? ఆఫీసు నుండి రైట్ రైట్ అన్నారా..? ఓవైపు పోస్ట్ వెరిఫికేషన్ కూడా చేశామని అనుమతి పత్రంలో ప్రస్తావించారు.. అక్రమ భవన నిర్మాణానికి, అధికారుల అనుమతుల పత్రానికి ఏమాత్రం పొంతన లేదు.. ముడుపులు స్వీకరించి పర్మిషన్ మంజూరు చేశారన్న ఆరోపణలకు మాత్రమే బలం చేకూరే విధంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి



మొదటి సారి రిజెక్ట్ చేసిన దుండిగల్ సర్కిల్..



రెండవసారి తిరస్కరించిన దరఖాస్తు..



మూడవ సారి, దరఖాస్తుకు "అండర్ డిపార్ట్‌మెంట్ వెరిఫికేషన్"





ముగ్గురిని సంపిన సంప్..!

- బాచుపల్లిలోని "దినేష్ ఎరిక్ అపార్ట్‌మెంట్"లో ప్రమాద ఘటన..
- మృత్యుకూపంగా మారిన సెప్టిక్ ట్యాంక్..! భద్రతా ప్రమాణాలు గాలికి..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, నవంబర్ 24: బతుకుదెరువు కోసం సొంత ఊరిని విడిచి, మహానగరంలో పనులు చేసుకుంటున్న ముగ్గురు కార్మికులకు మృత్యువే ఎదురైంది.. పారిశుద్ధ్య పనుల కోసం సంప్‌లోకి దిగిన ముగ్గురూ విగతజీవులుగా బయటకు రావడంతో బాచుపల్లి ప్రాంతంలో తీవ్ర విషాద చాయలు అలుముకున్నాయి.. అపార్ట్‌మెంట్ వాసుల మురుగునీటి శుద్ధి వ్యవస్థల నిర్వహణ లోపమా..? భద్రతా ప్రమాణాలు పాటించలేదో తెలియదు కానీ..! సెప్టిక్ ట్యాంక్‌లోకి ఒకరి తర్వాత ఒకరు దిగిన ముగ్గురు మృతి చెందడం.. ఈ విషయాన్ని బంధువులకు కూడా సమాచారం ఇవ్వకుండా, బయటకు పొక్కకుండా, జాగ్రత్త వహించి, మృతదేహాలను గాంధీ ఆసుపత్రికి తరలించడంతో, అసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది.. ఈ క్రమంలో అపార్ట్‌మెంట్ వాసులకు, మృతుల బంధువులకు తోపులాట జరిగింది.. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని 'దినేష్ ఎరిక్ అపార్ట్‌మెంట్'లో మంగళవారం మధ్యాహ్నం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. "హెచ్ఆర్ ఎన్విరో ప్రొటెక్షన్ సిస్టమ్" సంస్థకు చెందిన కార్మికులు ఎస్టీపీ (మురుగునీటి శుద్ధి కేంద్రం) వద్ద సంప్‌ను శుభ్రం చేసేందుకు పంపింగ్ పనులు చేపట్టారు.. ఈ క్రమంలో షణ్ముఖరావు అలియాస్ సుమన్, పవన్, సురేష్‌లు ప్రమాదవశాత్తు సంప్‌లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయినట్లు ప్రాథమిక సమాచారం.. అయితే, ప్రమాదానికి అసలు కారణాలు, విషవాయువుల ప్రభావం ఉందా, అనే వాస్తవాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది..

మృతులు అంతా, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి, కొత్తూరు మండలాలకు చెందిన వారిగా గుర్తించారు. సుమన్ (26), పవన్ (20), సురేష్‌ల మరణవార్తతో వారి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు..

కంపెనీ యజమానిపై కేసు నమోదు..

ఈ ప్రమాద ఘటనలో మృతి చెందిన సురేష్ బంధువు బాలసాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని ఎఫ్ఐఆర్ నెంబర్ 1148/2026 నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.. భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) సెక్షన్ 105 కింద హెచ్ఆర్ ఎన్విరో ప్రొటెక్షన్ సిస్టమ్ సంస్థ యజమాని రవిపై కేసు నమోదు చేసినట్లు బాచుపల్లి ఎస్‌హెచ్ఓ వెల్లడించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.. ఘటనకు సంబంధించి కంపెనీ నిర్వాహకుల బాధ్యత, కార్మికులకు కల్పించిన భద్రతా ఏర్పాట్లు, సంప్‌లోకి దిగే ముందు అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నారా లేదా అనే కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు.. అదే సమయంలో అపార్ట్‌మెంట్ యాజమాన్యం నిర్లక్ష్యం కూడా విచారణలో వెల్లడైతే వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు..

భద్రతా ప్రమాణాలు పాటించారా..?

ముగ్గురు కార్మికుల ప్రాణాలను బలిగొన్న ఈ ఘటన కీలక ప్రశ్నలను లేవనెత్తుతోంది. సంప్‌లోకి దిగే ముందు విషవాయువుల ఉనికిని పరీక్షించారా..? ఆక్సిజన్ స్థాయిని నిర్ధారించారా..? కార్మికులకు అవసరమైన శ్వాసరక్షణ పరికరాలు, భద్రతా సామగ్రి అందించారా..? అత్యవసర పరిస్థితుల్లో బయటకు తీసుకొచ్చేందుకు తగిన ఏర్పాట్లు ఉన్నాయా..? అనే అంశాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి..నిబంధనల ప్రకారం మురుగునీటి ట్యాంకులు, సెప్టిక్ ట్యాంక్‌లు, సంప్‌లు, మ్యాన్‌హోళ్లలోకి కార్మికులను దింపే సందర్భాల్లో అత్యంత కఠినమైన భద్రతా చర్యలు అవసరం.. కేవలం పని అప్పగించి చేతులు దులుపుకోకుండా, కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత, ఆ సంస్థతో పాటు సంబంధిత, అపార్ట్‌మెంట్ నిర్వహణ సంస్థలపైనా ఉంటుంది..

- శుభ్రం చేసేందుకు లోపలికి దిగిన ముగ్గురు కార్మికులు మృత్యువాత..
- భద్రతా ప్రమాణాలు బేఖాతరు..? సంప్ నిర్వహణలో అపార్ట్‌మెంట్ వాసుల నిర్లక్ష్యం..?
- మురుగునీటి శుద్ధి కేంద్రంలో పని కోసం దిగితే.. ప్రాణాలే పోయాయి..!
- ముగ్గురి మృతుల కుటుంబాల్లో చీకటిని నింపిన మురుగునీటి సంప్..
- మృతులు శ్రీకాకుళం జిల్లాకు చెందిన సుమన్, పవన్, సురేష్‌గా గుర్తింపు..
- సెప్టిక్ ట్యాంక్‌లో విషవాయువుల ప్రభావమా..? నిర్వహణ లోపం, భద్రతా వైఫల్యమా..?
- మృతదేహాల తరలింపుపై బంధువులు, అపార్ట్‌మెంట్ వాసుల మధ్య తోపులాట..!
- 'హెచ్ఆర్ ఎన్విరో' సంస్థ యజమానిపై కేసు నమోదు చేసిన పోలీసులు..
- అపార్ట్‌మెంట్ యాజమాన్యం నిర్లక్ష్యంపైనా పోలీసుల దర్యాప్తు..!
- అపార్ట్‌మెంట్ యాజమాన్యం నిర్లక్ష్యం తేలితే చర్యలు తప్పవని బాచుపల్లి పోలీసుల హెచ్చరిక..


మృతుని ఫైల్‌ఫొటో..


మృతుని ఫైల్‌ఫొటో..


మృతుని ఫైల్‌ఫొటో..





మృతదేహాల తరలింపుపై వివాదం..

ఘటన అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించే విషయంలో వివాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది.. మృతుల కుటుంబ సభ్యులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండానే మృతదేహాలను ఆసుపత్రికి తరలించడంపై బంధువులు అభ్యంతరం వ్యక్తం చేశారు.. ఈ క్రమంలో అపార్ట్‌మెంట్ వాసులు, మృతుల బంధువుల మధ్య వాగ్వాదం తీవ్రరూపం దాల్చి తోపులాటకు దారితీసినట్లు సమాచారం. అప్పటికే కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో ఉండగా, ఈ పరిణామం అక్కడ ఉద్రిక్తతకు దారితీసింది..

ఇలాగైతే ఎలా సారూ...కేసీఆర్ ది వ్యూహమా ?



హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు రెండేళ్లే సమయం ఉండగా, సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటనలతో ప్రజల్లోకి వెళ్తున్నారు. కేటీఆర్, హరీష్ రావు పార్టీని బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు కేసీఆర్ మాత్రం ఇప్పటికీ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారనే విమర్శలు వస్తున్నాయి. ఎన్నికలకు ఆరు నెలల ముందే జనంలోకి రావాలన్న కేసీఆర్ వ్యూహం ఎంతవరకు పనిచేస్తుందన్న చర్చ సాగుతోంది.

వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అవుతారు అని బీఆర్ఎస్ నేతలు పదే పదే చెబుతున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అయితే ఇదే మాట అంటున్నారు. హరీష్ రావు అదే ధీమాను ప్రదర్శిస్తున్నారు. అంతా బాగానే ఉంది కానీ తెలంగాణలో సార్వత్రిక ఎన్నికలు జరిగి మూడేళ్ళు అయింది. అచ్చంగా మరో రెండేళ్ల కాలం మాత్రమే అసెంబ్లీ ఎన్నికలకు ఉంది. ఈ మూడేళ్ళలో కేసీఆర్ ఎక్కడా బయటకు వచ్చింది పెద్దగా లేదని అంటున్నారు. అంతే కాదు ఆయన అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు. కానీ సభకు కూడా రావడం లేదు. కేసీఆర్ కేరాఫ్ ఫాం హౌస్ అని కాంగ్రెస్ నేతలు ఎద్దేవా చేస్తూనే ఉన్నారు. ఇంతలో మూడేళ్ళు ఇట్టే తిరిగిపోయాయి.

జనంలోకి రేవంత్ :

ఇదిలా ఉంటే జనంలోనే నిత్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉంటున్నారు. సీఎం గా ఆయనకు అధికారిక కార్యక్రమాలు ఎటూ ఉంటాయి. అయితే ఆయన అనేక జిల్లాలలో అధికారిక కార్యక్రమాలను నిర్వహిస్తూ జనాలకు కాంగ్రెస్ చేసిన మేలు చెబుతున్నారు. అదే సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగిన నష్టాన్ని వివరిస్తున్నారు. అంతే కాదు వారసత్వ రాజకీయాలను ఎండగడుతున్నారు. లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్ ని పూర్తిగా తప్పుపడుతున్నారు. తెలంగాణాకు అది గుదిబండగా మారింది అంటున్నారు. మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని అటు క్యాడర్ లోనూ ఇటు జనాల్లోనూ ధీమా పెరిగేలా చేస్తున్నారు. ఇక సంక్రాంతి తరువాత జిల్లాల టూర్లు రేవంత్ రెడ్డి పెట్టుకుంటున్నారు. అలా ఎన్నికలకు రెండేళ్ళ ముందే రాష్ట్రమంతా చుట్టేయాలని ఆయన భారీ ప్లాన్ తోనే ఉన్నారు. అదే సమయంలో బలమైన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ అయితే తన గ్రాఫ్ ని ఏ మేరకు పెంచుకుంది అన్నదే చర్చకు వస్తున్న విషయం.

జోడు గుర్రాలుగా :

ఇక కేసీఆర్ అయితే ఫాం హౌస్ లో ఉన్నారు కానీ కేటీఆర్ హరీష్ రావు జనంలోనే ఉంటూ పార్టీని పటిష్టం చేసే పనిని గట్టిగానే తీసుకున్నారు. అసెంబ్లీలో అయినా లేదా జనంలో అయినా లేదా పార్టీ ఆఫీసుల్లో అయినా ఈ ఇద్దరు నేతలు జోడు గుర్రాల మాదిరిగా ఉంటూ బీఆర్ఎస్ ని లేపడానికి చూస్తున్నారు. అయితే వారు ఎంత కష్టపడుతున్నా కూడా గులాబీ పార్టీ గ్రాఫ్ అనుకున్న స్థాయిలో పెరుగుతోందా అన్నదే చర్చగా ఉంది. రేవంత్ రెడ్డి దూకుడు ముందు అయితే బీఆర్ఎస్ జోడీ తేలిపోతోంది అన్నది కూడా విశ్లేషణగా ఉంది. కేసీఆర్ అవతల వైపు ఉంటేనే మజా ఉంటుందని అంటున్నారు.

గులాబీ బాస్ స్ట్రాటజీ :

ఇక చూస్తే కేసీఆర్ సరిగ్గా ఎన్నికలకు ఆరు నెలల ముందు జనంలోకి రావాలనుకుంటున్నారా అన్నది చర్చగా ఉంది. అపుడు వస్తే ఊపు వస్తుందని కూడా భావిస్తున్నారు అని అంటున్నారు. అప్పటికి ఎన్నికల మూడ్ వస్తుందని జనాలు చెప్పేది పూర్తిగా వింటారు అని కూడా ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. అయితే ఇవన్నీ ఓల్డ్ స్ట్రాటజీస్ అని మరో మాట వినిపిస్తోంది. గతంలోలా ఎన్నికల ముందు వస్తే జనాలు టర్న్ కావడం లేదని కూడా గుర్తు చేస్తున్నారు. కనీసం రెండేళ్ల ముందు అయినా జనంలోకి వస్తేనే ప్రజలు కూడా ఆలోచిస్తారని ఎన్నికల హడావుడిలో ఎంత చెప్పినా అది రాజకీయ చర్చగానే ఉంటుందని కూడా అంటున్నారు. అయితే కేసీఆర్ మాత్రం ఇప్పటప్పట్లో వచ్చేది లేదనే అంటున్నారు. మరి చూడాలి బీఆర్ఎస్ కొత్త ఎత్తుగడలు ఏ విధంగా ఉండబోతున్నాయో.

కృష్ణా జలాల్లో రెండు పార్టీలూ అన్యాయం చేశాయి

-3 పేజి తరువాయి

అసదుద్దీన్ ఒవైసీ మధ్యవర్తిత్వంతో కాంగ్రెస్, భారాస ఒక్కటవుతున్నాయి.

కేంద్ర మంత్రి బండి సంజయ్ నేతృత్వంలో కరీంనగర్‌లో నిర్వహించిన మహా పాదయాత్రకు జనం బ్రహ్మరథం పట్టారు. గతంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా పాదయాత్రకు ప్రజలు భారీగా తరలివచ్చారు. భాజపా కార్యక్రమాలకు వస్తున్న ప్రజాస్పందన చూసి కాంగ్రెస్ నాయకుల్లో అసహనం పెరుగుతోంది. భాజపా అధికారంలోకి వస్తే వారి అవినీతి వెలుగులోకి వస్తుందనే భయం పట్టుకుంది. తెలంగాణలో వచ్చేది భాజపా ప్రభుత్వమే. కేసీఆర్ తరహాలో కేంద్రంపై దుష్ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు. రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే రూ.40 కోట్ల ప్రజాధనంతో 'భారత్ సమిట్' నిర్వహించడం దురదృష్టకరం" అని అన్నారు. రాష్ట్ర ప్రజలకు కార్తిక పౌర్ణమి, సిక్కులకు ప్రకాష్ పర్వ్ శుభాకాంక్షలు తెలియజేశారు.

పార్టీ గీత దాటొద్దు...

-3 పేజి తరువాయి

అంతర్గత వేదికలపై చెప్పడానికి అనేక అవకాశాలున్నాయి కదా...ఇక్కడ సాధ్యం కాకపోతే దిల్లీ వెళ్లి అయినా చెప్పవచ్చు కదా" అని ఆయన వారిని ప్రశ్నించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

కొన్ని నియోజకవర్గాలకే నిధులు ఎలా ఇస్తారని ప్రశ్నించా: రాజగోపాల్‌రెడ్డి

"నన్ను 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఏఐసీసీ పెద్దలు దిల్లీకి పిలిపించుకుని కాంగ్రెస్ తరఫున పోటీ చేయాలని అడిగారు. ఎన్నికల్లో గెలిచి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరవాత మంత్రి పదవి ఇస్తామని వారే హామీ ఇచ్చి పట్టించుకోలేదు. నా నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడం లేదు. చేసిన పనులకు బిల్లులు ఇవ్వడం లేదు. రాష్ట్రంలో కొన్ని నియోజకవర్గాలకే నిధులు ఎలా ఇస్తారని, మిగిలిన వాటిని ఎందుకు పట్టించుకోవడం లేదని నేను ప్రశ్నించా" అని రాజగోపాల్‌రెడ్డి... సందీప్‌కు చెప్పినట్లు తెలిసింది. మంత్రి పదవిపై ఇచ్చిన హామీ అమలు విషయంపై ఏఐసీసీ పెద్దలతో తాను మాట్లాడతానని, బిల్లులకు నిధుల విడుదల సమస్యలను పరిష్కరిస్తానని సందీప్ ఆయనకు చెప్పినట్లు సమాచారం.

కాంట్రాక్టర్లు చనిపోతే తప్ప నిధులు ఇవ్వరా అని మాట్లాడా: అనిరుధ్‌రెడ్డి

అనిరుధ్‌రెడ్డి కూడా తన వివరణను గంటకు పైగా ఇచ్చారు. తన నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేసిన వారికి బిల్లులు మంజూరు కాకపోవడంపై తనను అందరూ ప్రశ్నిస్తున్నారని, కాంట్రాక్టర్లు చనిపోతే తప్ప నిధులు విడుదల చేయరా అని తాను మాట్లాడానని పేర్కొంటూ.. దానికి సంబంధించిన వీడియోను సందీప్, సచిన్ సావంత్‌లకు ఆయన చూపినట్లు తెలుస్తోంది. కర్ణాటకలో ఒక్కో ఎమ్మెల్యే పరిధిలో ఏడాదికి రూ.50 కోట్ల బిల్లులను అక్కడి ప్రభుత్వం మంజూరు చేస్తోందని, ఇక్కడ కూడా అలా ఇస్తే అభివృద్ధి పనులు వేగంగా జరుగుతాయని ఆయన చెప్పినట్లు సమాచారం. దీనిపై ప్రభుత్వంతో మాట్లాడతానని సందీప్ చెప్పినట్లు తెలిసింది.

ఎమ్మెల్సీ అభ్యర్థికి దిశానిర్దేశం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచేందుకు గట్టిగా పనిచేయాలని మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్‌రెడ్డికి సందీప్ సూచించారు. మంగళవారం ఉదయం రామ్మోహన్‌తో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు అవసరమైన ఏ పనులు కావాలన్నా తనతో ఎప్పుడైనా చెప్పవచ్చని, ఎమ్మెల్యేలు, ఇతర నేతలందరినీ కలసి విజయం కోసం పనిచేయాలని చెప్పారు. నల్గొండ-ఖమ్మం-వరంగల్ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్‌రెడ్డిని కూడా పిలిచారని, ఆయన రాలేకపోయారని తెలుస్తోంది. సందీప్ మంగళవారం బెంగళూరు వెళ్లారు. ఈ నెల 27న మళ్లీ హైదరాబాద్ వచ్చి ఎంపీలు, ఎమ్మెల్యేలతో మాట్లాడనున్నారు.

రైస్ మిల్లర్ల అక్రమాలు రూ. 6,700 కోట్లు



హైదరాబాద్, నవంబరు 24, పెన్ పవర్:

తెలంగాణాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ పేరిట ప్రభుత్వ ధాన్యాన్ని పక్కదారి పట్టించిన అక్రమార్కులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణను మరింత వేగవంతం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ ధాన్యాన్ని కాజేసి, బియ్యం తిరిగి అప్పగించని రైస్ మిల్లర్లపై ఈడీ మరిన్ని మనీలాండరింగ్ కేసులు నమోదు చేస్తూ కఠిన చర్యలకు ఉపక్రమించింది. ప్రాథమిక అంచనాల ప్రకారం, 2021--22 ఖరీఫ్ సీజన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ. 6,700 కోట్ల విలువైన ప్రభుత్వ ధాన్యం పక్కదారి పట్టినట్లు విచారణ సంస్థలు గుర్తించాయి. ఈ భారీ కుంభకోణం వెనుక ఉన్న ఆర్థిక లావాదేవీలు, అక్రమ ఆస్తుల కూడబెట్టడంపై ఈడీ ప్రత్యేక దృష్టి సారించింది.రైతుల నుంచి కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ మిల్లింగ్ కోసం రైస్ మిల్లులకు కేటాయిస్తుంది. అయితే, నిబంధనల ప్రకారం బియ్యం తయారు చేసి తిరిగి ప్రభుత్వానికి అప్పగించాల్సిన పలువురు మిల్లర్లు ఆ ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లో విక్రయించుకుని సొమ్ము చేసుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. గతంలో రాష్ట్ర విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, పౌరసరఫరాల శాఖ నిర్వహించిన తనిఖీల్లో పెద్ద ఎత్తున ధాన్యం నిల్వలు మాయమైనట్లు తేలడంతో, రాష్ట్రవ్యాప్తంగా వందలాది మంది మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఆ ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా రంగంలోకి దిగిన ఈడీ, భారీ స్థాయిలో నిధుల మళ్లింపు జరిగినట్లు ఆధారాలు సేకరించింది.ప్రస్తుతం ఈడీ అధికారులు తెలంగాణలోని కీలక జిల్లాలైన నిజామాబాద్, కరీంనగర్, నల్గొండ, సూర్యాపేట, వరంగల్, మెదక్ తదితర ప్రాంతాల్లోని డిఫాల్టర్ రైస్ మిల్లుల జాబితాను జల్లెడ పడుతున్నారు. ధాన్యాన్ని అమ్ముకుని ఆ డబ్బుతో బినామీ పేర్లతో కొనుగోలు చేసిన స్థిరాస్తులు, బ్యాంకు ఖాతాల వివరాలను ఆరా తీస్తున్నారు. ఇప్పటికే పలువురు బడా మిల్లర్లకు సమన్లు జారీ చేసి విచారణ జరుపుతుండగా, అక్రమంగా సంపాదించిన ఆస్తులను జప్తు చేసే దిశగా ఈడీ కసరత్తు ముమ్మరం చేసినట్లు సమాచారం. ఇందులో కొందరు అధికారులు, రాజకీయ నేతల ప్రమేయం ఉందా అనే కోణంలోనూ విచారణ కొనసాగుతోంది.ప్రభుత్వ ఖజానాకు వేల కోట్ల రూపాయల నష్టం కలిగించిన రైస్ మిల్లింగ్ మాఫియాపై ఈడీ దూకుడు పెంచడంతో అక్రమార్కుల్లో తీవ్ర ఆందోళన మొదలైంది. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం బకాయిల వసూలుకు కఠిన నిబంధనలు అమలు చేస్తుండగా, మరోవైపు ఈడీ మనీలాండరింగ్ కేసులతో ఉచ్చు బిగిస్తుండటంతో---రాబోయే రోజుల్లో ఈ కుంభకోణంలో మరిన్ని సంచలన అరెస్టులు, ఆస్తుల జప్తు చర్యలు ఉండే అవకాశం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

ఆటిజం పిల్లలకు ఆప్యాయత అవసరం

-3 పేజి తరువాయి

దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ కె.సుజనలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టి ఇటీవల తీర్పును వెలువరించింది. విదేశీ కోర్టుల్లో విచారణను నిలుపుతూ ఉత్తర్వులిచ్చే ముందు సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో వెలువరించిన మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోవాలని కింది కోర్టులకు సూచించింది. భర్తను నిర్బంధంలోకి తీసుకోవాలంటూ కింది కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దుచేస్తూ విదేశీ కోర్టుల విచారణపై ఉత్తర్వులకు సంబంధించిన అంశాన్ని సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించాలని కుటుంబ న్యాయస్థానానికి సూచించింది. ఈ సందర్భంగా దాంపత్య వివాదాలకు సంబంధించిన కేసుల్లో కోర్టులు, న్యాయవాదులు ఉదార దృక్పథాన్ని అనుసరించాలని.. తమ మాటలు, చర్యల ద్వారా వారి సంబంధాలను మరింత దెబ్బతీయరాదని హితవు పలికింది.

నాడు ధన దాహంతో నీటి ఒప్పందాలు

-3 పేజి తరువాయి

కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు."భారాస నేతలు చేయాల్సిన తప్పులన్నీ చేసి, ప్రజా ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారు. నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు హరీశ్‌రావు వెలగబెట్టింది ఏంటో సూటిగా చెప్పాలి. కృష్ణా జలాల్లో తెలంగాణకు కేవలం 299 టీఎంసీల వాటాకే ఒప్పందం చేసుకుని రైతాంగాన్ని నట్టేట ముంచారు. అధికారం పోయిందన్న అక్కసుతో మూడేళ్లుగా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారు. కేసీఆర్ ఫాంహౌస్ చుట్టూ తప్ప ఎక్కడా పంట కాల్వలు తవ్వలేదు కానీ... 10, 20 లక్షల ఎకరాలకు సాగు నీరు తీసుకొచ్చారా? రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో జలయజ్ఞంలో చేపట్టిన ప్రాజెక్టుల్లోని తుమ్మచెట్లు పీకేసి ఆ ప్రాజెక్టులన్నీ తామే కట్టామని చెప్పుకోవడం సిగ్గుచేటు. భూసేకరణకు భారాస ప్రభుత్వం కన్నా మేమే ఎక్కువ డబ్బు పరిహారంగా ఇచ్చాం. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పడావున పడ్డ తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయంలో మళ్లీ కదలిక వచ్చింది. మా నిజాయతీ, చిత్తశుద్ధి ప్రజలకు తెలుసు. ఎట్టి పరిస్థితిలో రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెట్టబోం" అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

ప్రీ లాంచ్ ఆఫర్లపై హైడ్రా కొరడా



హైదరాబాద్, నవంబరు 24, పెన్ పవర్:

హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండా వెలుస్తున్న అక్రమ లేఅవుట్లు, ఆకర్షణీయమైన ప్రకటనలతో సామాన్యులను బురిడీ కొట్టిస్తున్న ప్రీ-లాంచ్ ఆఫర్లపై హెచ్ఎండీఏ , హైడ్రా సంయుక్తంగా ఉక్కుపాదం మోపుతున్నాయి. రెరా రిజిస్ట్రేషన్ గానీ, లేఅవుట్ అనుమతులు గానీ లేకుండానే కేవలం ఎంవోయూల పేరుతో కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్న సంస్థలపై ప్రత్యేక నిఘా పెట్టారు. అనుమతులు లేని వెంచర్లలో ప్లాట్లు విక్రయించడం చట్టరీత్యా నేరమని హెచ్చరిస్తూ, అలాంటి లేఅవుట్లలోని అక్రమ నిర్మాణాలు, ప్రహరీలు, రోడ్లను అధికారులు ఎక్కడికక్కడ నేలమట్టం చేస్తున్నారు.చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో కూల్చివేతల పర్వం: మరోవైపు, నగరంలోని చెరువులు, కుంటలు, నాలాల పరిరక్షణలో భాగంగా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో వెలిసిన నిర్మాణాలపై హైడ్రా కఠిన చర్యలను కొనసాగిస్తోంది.నిబంధనల ప్రకారం 10 హెక్టార్ల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న చెరువులకు 30 మీటర్లు, చిన్న కుంటలకు 9 మీటర్ల వరకు బఫర్ జోన్‌లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. సాటిలైట్ చిత్రాలు, జీఐఎస్ సాంకేతికత సహాయంతో చెరువుల సరిహద్దులను గుర్తిస్తున్న అధికారులు, గతంలో ఏవైనా తప్పుడు ఎన్వోసీలు లేదా అనుమతులు పొంది ఉన్నా సరే,జలవనరులను ఆక్రమించికట్టిన కట్టడాలను నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నారు.ఇటీవల కాలంలో హైదరాబాద్ శివార్లలో ప్రీ-లాంచ్ ఆఫర్ల పేరుతో వందలాది కోట్ల రూపాయల మోసాలు వెలుగులోకి రావడంతో యంత్రాంగం మరింతఅప్రమత్తమైంది. తక్కువ ధరల ఆశ చూపి అనుమతులు లేని ప్రాజెక్టులలో పెట్టుబడులు పెట్టించే రియల్ ఎస్టేట్ సంస్థలు, ఏజెంట్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులు నిర్ణయించారు. కొనుగోలుదారులు ఏదైనా ప్లాట్ లేదా ఫ్లాట్ కొనే ముందు తప్పనిసరిగా టీజీ రెరా పోర్టల్, హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌లలో అనుమతుల వివరాలను తనిఖీ చేసుకోవాలని, కేవలం బ్రోచర్లు లేదా మధ్యవర్తుల మాటలు నమ్మి మోసపోవద్దని హెచ్ఎండీఏ స్పష్టం చేసింది.హెచ్ఎండీఏ , హైడ్రా చేపడుతున్న ఈ సంయుక్త ఆపరేషన్లతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. పర్యావరణ నిబంధనలు, మాస్టర్ ప్లాన్‌ను ఉల్లంఘించే వెంచర్లకు అడ్డుకట్ట వేయడం ద్వారా భవిష్యత్తులో నగరానికి వరద ముప్పు తప్పుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ కఠిన చర్యల వల్ల రియల్ ఎస్టేట్ రంగంలో మోసపూరిత సంస్థలు కనుమరుగై, నిబంధనలకు లోబడి పనిచేసే జెన్యూన్ డెవలపర్లకు, సామాన్య కొనుగోలుదారులకు పూర్తి భరోసా లభించనుంది.

మే నెల నుంచి తొలి బుల్లెట్ ట్రైన్

హైదరాబాద్, నవంబరు 24, పెన్ పవర్: దేశంలో తొలి బుల్లెట్ ట్రైన్ ప్రయాణం కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ శుభవార్త అందించారు. ప్రతిష్ఠాత్మక అహ్మదాబాద్-ముంబై హైస్పీడ్ రైల్ కారిడార్ పనులు శరవేగంగా తుది దశకు చేరుకుంటున్నాయని, వచ్చే ఏడాది మే లేదా జూన్ నెలలో బుల్లెట్ ట్రైన్ ట్రయల్ రన్ నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు ఆయన అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు బెంగళూరులోని బీఈఎంఎల్ , ఐసీఎఫ్ సంస్థలు స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిస్తున్న 'బీ28' (డీ28) బుల్లెట్ రైలు కోచ్‌లు వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి సూరత్ డిపోకు చేరుకోనున్నాయి.మొత్తం 8 కోచ్‌లతో, 202 మీటర్ల పొడవు ఉండే ఈ రైలులో ఒకేసారి 557 మంది ప్రయాణించే వీలుంటుంది. అహ్మదాబాద్ నుంచి ముంబై మధ్య 508 కిలోమీటర్ల మేర నిర్మాణంలో ఉన్న ఈ కారిడార్ ప్రాజెక్టు తాజాగా మరో కీలక మైలురాయిని అధిగమించింది. గుజరాత్‌లోని సూరత్ నుంచి బిలిమోరా మధ్య సుమారు 50 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్‌పై ట్రాక్ నిర్మాణంతో పాటు 25 కేవీ ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్ విద్యుదీకరణ పనులను నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ విజయవంతంగా పూర్తి చేసింది. అప్, డౌన్ రెండు లైన్లలోనూ విద్యుత్ సరఫరాను పరీక్షించారు. ట్రయల్ రన్ సమయంలో ఈ బుల్లెట్ రైలు గంటకు 250 కిలోమీటర్ల వేగంతో (గరిష్ఠంగా 280 కి.మీ. సామర్థ్యం) పట్టాలపై దూసుకెళ్లనుంది.మే నెలలో ప్రారంభమయ్యే సాంకేతిక పరీక్షలు రెండు నుంచి నాలుగు నెలల పాటు కొనసాగనున్నాయి. అన్నీ సవ్యంగా సాగితే వచ్చే ఏడాది ఆగస్టు 15 నాటికి ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా సూరత్-బిలిమోరా మధ్య తొలి దశ బుల్లెట్ రైలు సేవలను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని రైల్వే శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం 508 కిలోమీటర్ల కారిడార్‌లో 12 స్టేషన్లు ఉండగా, ఇందులో 21 కిలోమీటర్ల మేర భూగర్భ సొరంగం, సముద్ర గర్భంలో 7 కిలోమీటర్ల సొరంగ మార్గం నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ప్రస్తుతం సాధారణ రైళ్లలో ఆరు నుంచి ఏడు గంటలు పట్టే అహ్మదాబాద్-ముంబై ప్రయాణ సమయం కేవలం రెండు గంటలకు తగ్గిపోనుంది.

కార్తీక పౌర్ణమి సందర్భంగా చింతపల్లి స్టేజి వద్ద భక్తుల సందడి

పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్న భక్తులు

కోర్కెలు నెరవేరుతాయని విశ్వాసం





ఖమ్మం , పెన్ పవర్, నవంబర్ 24:కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఖమ్మం రూరల్ మండలం చింతపల్లి స్టేజి వద్ద భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టకు పాలు పోసి తమ మొక్కులను భక్తిశ్రద్ధలతో చెల్లించుకున్నారు.

చింతపల్లి స్టేజి వద్ద ఉన్న పుట్టను భక్తులు కొంగుబంగారంగా భావిస్తారు. ఇక్కడ పుట్టకు పాలు పోసి నాగదేవతను ప్రార్థిస్తే తమ కోరికలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. నాగుల చవితి నుంచి కార్తీక పౌర్ణమి వరకు భక్తులు ఇక్కడికి చేరుకుని పాలు పోస్తూ, ప్రత్యేక పూజలు చేస్తూ తమ మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోంది.కార్తీక పౌర్ణమి చివరి రోజున కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో చింతపల్లి స్టేజి వద్ద ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ం

నషా ముక్త్ భారత్ సందేశంతో సైక్లింగ్ యాత్ర

న్యూఢిల్లీలో కాశ్మీర్--కన్యాకుమారి సైక్లింగ్ బృందానికి వెల్ఫేర్ వేవ్స్ ఫౌండేషన్ ఘన స్వాగతం





న్యూ ఢిల్లీ, పెన్ పవర్ నవంబర్ 24:హెచ్‌సీజీ 4వ ఎడిషన్ కాశ్మీర్--కన్యాకుమారి సైక్లింగ్ యాత్ర బృందానికి న్యూఢిల్లీలో వెల్ఫేర్ వేవ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. మాదకద్రవ్యాల రహిత భారతదేశం, ఆరోగ్యం, ఫిట్‌నెస్, జాతీయ ఐక్యతతో పాటు మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ సైక్లింగ్ యాత్ర కొనసాగుతోంది. ఇండియన్ ఫోర్సెస్ ఫ్లాగ్ డేను పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ వేవ్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు సభావట్ కళ్యాణ్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల రహిత భారతదేశ నిర్మాణానికి ఆరోగ్యవంతమైన, చైతన్యవంతమైన యువతే పునాది అని అన్నారు. యువత క్రీడలు, విద్య, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకునేలా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సాగుతున్న ఈ సైక్లింగ్ యాత్ర దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాల వ్యతిరేక ఐక్యతకు బలమైన సందేశాన్ని ఇస్తోందని, నషా ముక్త్ భారత్‌ను ప్రజా ఉద్యమంగా మార్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సైక్లింగ్ యాత్ర బృందానికి ఫౌండేషన్ తరఫున అభినందనలు తెలియజేసి, యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు రణదీప్ రెడ్డి, సామాజిక కార్యకర్తలు గౌరవ్ పాటిల్, ఆయుష్ గుప్తా, గౌరవ్ టాండన్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీని గాడిలో పెట్టేందుకు తీసుకున్న చర్యలతో ఓకేనా?



తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ ఛార్జి బీఎం సందీప్ "ఆపరేషన్ హస్తం" ప్రారంభించారు. తెలంగాణ కాంగ్రెస్ కొత్త ఏఐసీసీ ఇన్‌ఛార్జిగా నియమితులైన బీఎం సందీప్ కుమార్ పార్టీలో అంతర్గత విభేదాలను పరిష్కరించడానికి , సమన్వయాన్ని పెంచడానికి ఇప్పటికే చర్యలు ప్రారంభించారు. మీనాక్షి నటరాజన్ స్థానంలో బాధ్యతలు స్వీకరించిన ఆయన, పార్టీని చక్కదిద్దడానికి తీసుకుంటున్న చర్యలు వేగంగా సాగుతున్నాయి. గత రెండు రోజుల నుంచి హైదరాబాద్ లో ఉన్న ఆయన పార్టీ ముఖ్య నేతలతోనూ, అసంతృప్త నేతలతోనూ సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. ప్రధానంగా అసమ్మతి గళం వినిపిస్తున్న నేతలను పిలిపించుకుని పార్టీ అండగా ఉంటుందని, పార్టీకి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎటువంటి వ్యాఖ్యలు చేయవద్దని సూచిస్తున్నారు.

అసంతృప్త ఎమ్మెల్యేలతో...

ముఖ్యంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డిలతో బీఎం సందీప్ సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి మూడేళ్లపుతున్నా తనను పట్టించుకోవ డం లేదని కోమటిరెడ్డి ఈసందర్భంగా బీఎం సందీప్ కు చెప్పారు. దీనికి ఆయన హైకమాండ్ తో తాను మాట్లాడి పాజిటివ్ నిర్ణయం వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. అలాగే నియోజకవర్గానికి అభివృద్ధి నిధులను కూడా కేటాయించాలని కోరడంతో తాను ముఖ్యమంత్రితో మాట్లాడి నిధుల విడుదలకు సహకరిస్తానని బీఎం సందీప్ తెలిపారు. మరొకవైపు అనిరుధ్ రెడ్డి తో కూడా సమావేశమై ఆయన సమస్యలను పరిష్కరించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని తెలపడంతో పాటు కమీషన్లు లేకుండా, పూర్తి పారదర్శకంగా పాలన జరిగేలా చూస్తానని ఆయనకు హామీ ఇవ్వడంతో ఆయన కూడా కొంత చల్లబడినట్లు తెలిసింది

బహిరంగ వ్యాఖ్యలపై హెచ్చరిక....

పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా బహిరంగంగా వ్యాఖ్యలు చేయవద్దని, ఏవైనా ఫిర్యాదులు లేదా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి గానీ, అధిష్ఠానం దృష్టికి గానీ తీసుకురావాలని ఆయన ఎమ్మెల్యేలకు స్పష్టం చేయాలని సూచించారు.హైదరాబాద్ పర్యటనలో భాగంగా ఆయన గాంధీ భవన్‌లో పొలిటికల్ అఫైర్స్ కమిటీ , విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశాలు నిర్వహించారు. మంత్రులు, డీసీసీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నేతలతో వేర్వేరుగా భేటీ అవుతూ, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వ్యక్తిగతంగా చర్చించనున్నారు. కర్ణాటకలోని చిక్కమగళూరుకు చెందిన సందీప్, గతంలో మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలకు ఏఐసీసీ సహ ఇన్‌ఛార్జిగా పనిచేశారు. సంస్థాగత నిర్మాణంలో ఆయనకున్న అనుభవంతో పార్టీ మరింత బలపడుతుందని పార్టీ నేతలు చెబుతున్నారు. అయితే రానున్న ఎన్నికల్లో పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి క్షేత్రస్థాయిలో కార్యకర్తలను, నేతలను ఏకతాటిపైకి తీసుకురావడం ఆయన ముందున్న కీలక బాధ్యత అని, ఆ మార్గంలోనే బీఎం సందీప్ వెళుతున్నారన్న కామెంట్స్ పార్టీ నేతల నుంచి వినపడుతుంది.

హైదరాబాద్ అభివృద్ధిని ఆపేదెవరు? ఎవరి తరమూ కాదుగా



హైదరాబాద్ అభివృద్ధిని ఎవరూ ఆపలేరు. నగరం నలుదిశలా డెవలెప్ మెంట్ వైపు పరుగులు పెడుతుంది. కొన్ని పదుల కిలోమీటర్ల దూరం వరకూ హైదరాబాద్ నగరం నాలుగు వైపులా విస్తరించింది. ప్రభుత్వం ఏది ఉన్నా, పాలకులు ఎవరున్నా, నిర్ణయాలు ఎలా ఉన్నప్పటికీ హైదరాబాద్ అభివృద్ధిని ఆపడం ఎవరి తరమూ కాదన్న అభిప్రాయం అందరిలోనూ వ్యక్త మవుతుంది. ఇప్పటికే హైదరాబాద్ జనాభా కోటిన్నర కు దరిదాపులకు చేరింది. ఇంకా పెరగడమే తప్ప తగ్గే అవకాశాలు ఎంత మాత్రం భవిష్యత్ లో కనిపించడం లేదు. దీంతో రియల్ రంగం మరింత ఊపందుకుంటుంది. హైదరాబాద్ నగరం అందరినీ ఆదరిస్తుంది. అలాగే పేద, మధ్యతరగతి, ధనిక అన్న తేడా లేకుండా అన్ని వర్గాలకు అనుకూలమైన నగరంగా హైదరాబాద్ కు చాలా రోజుల నుంచి పేరుంది.సాగర్ రోడ్డులోనూ, ఇటు ముంబయి హైవేలోనూ, మేడ్చల్ వైపునకు, విజయవాడ సైడ్ ఒకటి కాదు, వరంగల్ వైపు కూడా నగరం అభివృద్ధి చెందుతోంది.

జనాభా పెరుగుతున్న కొద్దీ...

హైదరాబాద్ జనాభా పెరుగుతున్న కొద్దీ సమస్యలు కూడా సాధారణంగానే పెరుగుతున్నాయి. నీటి సమస్య, తాగు నీటి సమస్య, వ్యర్థ పదార్థాల తొలగింపు, డ్రెయిన్లు, ట్రాఫిక్ వంటి సమస్యలు చుట్టుముడుతున్నా అనేక మంది ఇటు ఆంధ్రప్రదేశ్, అటు తెలంగాణ నుంచి మాత్రమే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చి ఇక్కడ ఉపాధి పొందుతున్నారు. ఏ రకమైన జీవితాన్ని అయినా హైదరాబాద్ లో అనుభవించవచ్చు. మరొకవైపు ఆరోగ్య పరంగా కూడా అందరికీ అందుబాటులో ఆరోగ్య సేవలు కూడా అందుబాటులో ఉండనున్నాయి. హెల్త్ పరంగా ఇతర రాష్ట్రాల నుంచి మాత్రమే కాకుండా విదేశాల నుంచి వచ్చి ఇక్కడ చికిత్స చేయించుకుంటున్నారు. మెట్రో రైలు రెండో దశ విస్తరణ మరియు రీజినల్ రింగ్ రోడ్డు వంటివి పూర్తయితే ఇక హైదరాబాద్ నగరం డెవలెప్ మెంట్ ను ఆపడం ఎవరికి సాధ్యం కాదు. మెట్రో రైలు వంటి కీలక ప్రాజెక్టులకు నిధులు, అనుమతులు ఇవ్వకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వివక్ష చూపుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. అలాగే, బీఆర్ఎస్ మరియు బీజేపీ కలిసి రాష్ట్ర పెట్టుబడులను, 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టును అడ్డుకుంటున్నాయని కాంగ్రెస్ విమర్శిస్తోంది.

రాజకీయ విమర్శలు...

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల వల్ల నగరంలో శాంతిభద్రతలు దెబ్బతిని, పెట్టుబడిదారులలో నమ్మకం తగ్గుతోందని బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఆరోపిస్తున్నారు. హైడ్రా కూల్చివేతల వల్ల రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని, గతంలో తాము తెచ్చిన పరిశ్రమలు, మౌలిక వసతుల కల్పన వేగం ఇప్పుడు తగ్గిందని బీఆర్ఎస్ విమర్శిస్తోంది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా తెలంగాణకు రావాల్సిన నిధులను నిలిపివేసిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మరియు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ హైదరాబాద్ మౌలిక వసతులను నిర్లక్ష్యం చేశాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శిస్తున్నారు. సాంకేతిక లోపాలను, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే కేంద్రంపై నిందలు వేస్తున్నారని, మెట్రో ప్రాజెక్టు ఆలస్యానికి రాజకీయ కారణాలు లేవని బీజేపీ స్పష్టం చేస్తోంది. కాంగ్రెస్ కార్యకర్తల ఆందోళనల వల్ల నగరంలో వ్యాపార వాతావరణం దెబ్బతింటోందని ఆ పార్టీ ఆరోపిస్తోంది.

ఆర్థిక మరియు పట్టణాభివృద్ధి నిపుణుల విశ్లేషణ...

రాజకీయ ఆరోపణలకు భిన్నంగా, నగర అభివృద్ధి వేగం తగ్గకపోవడానికి అనేక కారణాలున్నాయి. భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సరైన చర్చలు, సాంకేతిక స్పష్టత లేకపోవడం వల్ల నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. ప్రభుత్వాలు మారినప్పుడల్లా గతంలో ప్రారంభించిన ప్రాజెక్టుల పేర్లు, ప్రణాళికలు మార్చడం వల్ల పెట్టుబడిదారులలో మరియు రియల్ ఎస్టేట్ రంగంలో అయోమయం ఏర్పడుతోంది. అభివృద్ధి అంతా హైదరాబాద్ చుట్టూనే కేంద్రీకృతం కావడం వల్ల నగరంపై విపరీతమైన ఒత్తిడి పెరుగుతోందని, రాష్ట్రంలోని ఇతర పట్టణాలను కూడా ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని విధాన నిపుణులు సూచిస్తున్నారు. మొత్తాని కి, హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్నది ఎవరనే దానిపై అధికార, ప్రతిపక్ష పార్టీలు పరస్పరం నిందలు వేసుకుంటున్నాయి. అయితే, రాజకీయ విభేదాలకు అతీతంగా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం, స్థిరమైన విధానాలు ఉన్నప్పుడే నగర అభివృద్ధి వేగవంతమవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. కానీ హైదరాబాద్ నగరం విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, దానంతటే అభివృద్ధి చెందుతుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి.

బెంగళూరు, ముంబైకి షాక్.. ఉద్యోగాల కల్పనలో మన హైదరాబాదే తోపు



వైట్ కాలర్ ఉద్యోగాల కల్పనలో 2026లో హైదరాబాద్ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచింది. ఫౌండిట్ నివేదిక ప్రకారం, జనవరి నుంచి అక్టోబర్ వరకు నగరంలో ఉద్యోగ నియామకాలు 8.51 శాతం పెరిగాయి. బెంగళూరులో 6.71%, ముంబైలో 6.15% వృద్ధి నమోదైంది. 2027లోనూ హైదరాబాద్ 10.33 శాతం ఉద్యోగ వృద్ధిని సాధిస్తుందని నివేదిక అంచనా వేసింది. ఒకప్పుడు మంచి ఉద్యోగం సంపాదించాలంటే.. జీవితంలో స్థిరపడాలంటే ఏ బెంగళూరుకో.. ముంబైకో వలస వెళ్లాల్సి వచ్చేది. కన్నవారిని.. పుట్టిన ఊరిని వదిలి వేల మైళ్ల దూరం వెళ్లలేక ఎంతోమంది యువత తమ కలలను మనసులోనే చంపుకునేవారు. కానీ కాలం మారింది.. మన భాగ్యనగరం ఇప్పుడు దేశానికే దిక్సూచిగా నిలిచింది.. అవును.. వైట్ కాలర్ ఉద్యోగాల కల్పనలో దేశంలోని దిగ్గజ నగరాలన్నింటినీ వెనక్కి నెట్టి 2026లో మన హైదరాబాద్ నంబర్ వన్ స్థానంలో నిలిచిందన్న వార్త ప్రతి తెలుగు గుండెను గర్వంతో ఉప్పొంగేలా చేస్తోంది. ప్రముఖ జాబ్ పోర్టల్ ఫౌండిట్ విడుదల చేసిన తాజా నివేదిక నిరుద్యోగ యువత జీవితాల్లో వెలుగులు నింపే ఒక అద్భుతమైన శుభవార్తను మోసుకొచ్చింది. 2026 జనవరి నుంచి అక్టోబర్ మధ్య దేశవ్యాప్తంగా ఉద్యోగ నియామకాలు కేవలం 3.30 శాతం మాత్రమే పెరిగితే.. ఒక్క హైదరాబాద్‌లోనే ఏకంగా 8.51 శాతం వృద్ధి నమోదైంది. ఒకప్పుడు ఐటీ రంగానికి రారాజుగా వెలిగిన బెంగళూరు 6.71%, ఆర్థిక రాజధాని ముంబై 6.15% సైతం మన హైదరాబాద్ వేగం ముందు తలవంచాయి. కోల్‌కతా, చండీగఢ్ వంటి నగరాల్లో ఉద్యోగాలు తగ్గిపోయి నిరాశ అలుముకున్న వేళ హైదరాబాద్ మాత్రం ఆశల దీపంలా వెలుగుతోంది. ప్రపంచ స్థాయి దిగ్గజ కంపెనీలు తమ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ల ఏర్పాటుకు హైదరాబాద్‌నే మొదటి ఎంపికగా ఎంచుకుంటున్నాయి. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, డేటా అనలిస్టులు, ఫైనాన్స్ నిపుణులు ఇలా ఎందరో యువతీయువకుల కళ్లల్లో మెరుపులు కనిపిస్తున్నాయి. అప్పుడే చదువు పూర్తి చేసుకుని భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో నగరంలో అడుగుపెడుతున్న ప్రతి ఒక్కరికీ హైదరాబాద్ అమ్మలా అక్కున చేర్చుకుని ఉపాధి కల్పిస్తోంది. ఈ విజయ ప్రస్థానం ఇక్కడితో ఆగిపోదు. 2027లో దేశవ్యాప్తంగా ఉద్యోగ నియామకాలు 8.16 శాతం పెరిగి.. ఏకంగా 1.38 కోట్లకు చేరుకోనున్నాయని నివేదిక చెబుతోంది. ముఖ్యంగా కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ 14.25%, రిటైల్ 13.99%, తయారీ రంగం 12.02%, లాజిస్టిక్స్, బ్యాంకింగ్ రంగాల్లో ఉద్యోగాల జాతర జరగనుంది. 2027లోనూ హైదరాబాద్ 10.33 శాతం వృద్ధితో దేశంలోనే టాప్-3లో తన సత్తా చాటనుంది.

అయితే ఈ అద్భుత అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే యువత నిరంతరం తమను తాము మెరుగుపరుచుకోవాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా ఏఐ , డేటా అనలిటిక్స్, డిజిటల్ నైపుణ్యాలను ఒంటబట్టించుకుంటే ఆకాశమే హద్దుగా ఎదగవచ్చు. కష్టపడే తత్వం, కొత్త విషయాలు నేర్చుకోవాలనే తపన ఉంటే చాలు.. మీ కలలను నిజం చేయడానికి మన హైదరాబాద్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంది..

బొత్స వర్సెస్ చిన్న శ్రీను.. చీపురుపల్లిలో డైరెక్ట్ ఫైట్





చీపురుపల్లి రాజకీయాల్లో బొత్స సత్యనారాయణ, చిన్నశ్రీను మధ్య పోటీ ఆసక్తికరంగా మారింది. గత పరిషత్ ఎన్నికలకు దూరంగా ఉన్న చిన్నశ్రీను ఇప్పుడు పంచాయతీ ఎన్నికల్లో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. చీపురుపల్లి, కొండపాలెం మేజర్ పంచాయతీలను రెండు వర్గాలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో స్థానిక పోరు వేడెక్కింది.

ఉత్తరాంధ్రలో అత్యంత కీలక నియోజకవర్గమైన చీపురుపల్లిలో వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, టీడీపీ కీలక నేత, జడ్పీ మాజీ చైర్మన్ చిన్న శ్రీను మధ్య రాజకీయ పోరు ఉత్కంఠ రేకెత్తిస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ఇద్దరు ముఖాముఖి పోటీ చేస్తారో లేదో కానీ ప్రస్తుతం ఒకరిపై ఒకరు పైచేయి సాధించేలా వ్యూహరచన చేస్తున్నారు. జడ్పీ, మండల పరిషత్ ఎన్నికల సమయంలో బొత్స సొంత నియోజకవర్గం చీపురుపల్లికి దూరంగా ఉన్న చిన్నశ్రీను ఇప్పుడు జరుగుతున్న పంచాయతీ ఎన్నికలను సవాల్ గా తీసుకోవడమే ఆసక్తి రేకెత్తిస్తోందని అంటున్నారు.

దాదాపు రెండున్నర దశాబ్దాలుగా చీపురుపల్లి కేంద్రంగా బొత్స, చిన్న శ్రీను రాజకీయాలు చేస్తున్నారు. బొత్స అడుగు జాడల్లో ఇన్నాళ్లు నడిచిన చిన్నశ్రీను ఇప్పుడు సొంత బలం నిరూపించుకునే పనిలో పడ్డారు. అయితే ప్రస్తుతం చీపురుపల్లిలో టీడీపీ సీనియర్ నేత కళావెంకటరావు ఎమ్మెల్యేగా ఉండటంతో అక్కడి రాజకీయాలకు చిన్నశ్రీను దూరంగా ఉంటున్నారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన తాను చీపురుపల్లి రాజకీయాల్లో జోక్యం చేసుకుంటే విభేదాలు తలెత్తే అవకాశం ఉందన్న ఆలోచనతో అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తూ వచ్చారు. దీని ఫలితంగా జడ్పీటీసీ ఎన్నికల్లో బొత్స పైచేయి సాధించారని విశ్లేషిస్తున్నారు. నియోజకవర్గంలో నాలుగు జడ్పీటీసీలకు రెండు వైసీపీ గెలుచుకోగా, ఒక మండల పరిషత్ నూ కైవసం చేసుకుంది. అదే సమయంలో ఒక మండల పరిషత్ లో టీడీపీతో సమానంగా సీట్లు సాధించింది.సంఖ్యాపరంగా చూస్తే టీడీపీదే మెజార్టీ అయినప్పటికీ బొత్స బలపడ్డారనేది కాదనలేని నిజమని విశ్లేషిస్తున్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు వైఫల్యం కూడా ఉందనే టాక్ నడుస్తోంది. ఎమ్మెల్యే రాజకీయ చతురతతో నడుచుకుని ఉంటే వైసీపీ ఒక్కచోట గెలిచేది కాదని, బొత్స వ్యూహాలు తెలిసిన చిన్న శ్రీనును దూరంగా ఉంచడంతో మూల్యం చెల్లించుకున్నారని సొంత పార్టీ కార్యకర్తలే అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల విషయంలో చిన్న శ్రీను జోక్యం చేసుకోడం హాట్ టాపిక్ అవుతోంది.పరిషత్ ఎన్నికల సమయంలో చీపురుపల్లి వైపు చూడని చిన్నశ్రీను పంచాయతీ పోరులో మాత్రం దూకుడు చూపుతున్నారు. దగ్గరుండి పార్టీ మద్దతుదారులతో నామినేషన్లు వేయించడం, వారి గెలుపు బాధ్యతను తన భుజాన వేసుకుంటున్నట్లు ప్రకటించడంతో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. నియోజకవర్గంలో రెండు మేజర్ పంచాయతీలు ఉండగా, దాదాపు 30 వేల ఓట్లు ఆ రెండు పంచాయతీల పరిధిలో ఉన్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాలంటే చీపురుపల్లి, కొండపాలెం మేజర్ పంచాయతీల్లో మెజార్టీ సాధించాల్సివుంటుందని అంటున్నారు.

ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు ఒక అడుగు వెనక్కి తగ్గి చిన్న శ్రీనుకు ఆ రెండు పంచాయతీలను అప్పగించాల్సివచ్చిందని అంటున్నారు. అటు బొత్స సైతం ఈ రెండు పంచాయతీలను తన వ్యక్తిగత ప్రతిష్టకు తీసుకున్నారని చెబుతున్నారు. జడ్పీటీసీ ఎన్నికల్లో కొండపాలెం మేజర్ పంచాయతీలోని మూడు ఎంపీటీసీ స్థానాలను వైసీపీ గెలుచుకోవడంతో అక్కడ ఆ పార్టీ పునాదులు గట్టిగా ఉన్నాయనే విషయాన్ని సూచిస్తోందని అంటున్నారు. చీపురుపల్లి పట్టణంలోని ఆరు ఎంపీటీసీ స్థానాలను టీడీపీ గెలుచుకుంది. అయితే ఓటింగ్ సరళిని గమనిస్తే ఇక్కడ టీడీపీ, వైసీపీ మధ్య నువ్వానేనా అన్నట్లు పోటీ ఉందని చెబుతున్నారు. అదేసమయంలో జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ ఎంపీ బెల్లాన కుమారుడికి మెజార్టీ వచ్చినట్లుగా విశ్లేషిస్తున్నారు.

ఈ నేపథ్యంలో చీపురుపల్లి పంచాయతీపై వైసీపీ జెండా ఎగరేయాలని మాజీ మంత్రి బొత్స పావులు కదుపుతున్నారు. పార్టీ మద్దతుదారు నామినేషన్ కార్యక్రమానికి స్వయంగా హాజరైన ఆయన కార్యక్రమానికి హాజరైన ఓటర్లను చూసి సంతృప్తి చెందారని అంటున్నారు. గెలుపుపై ఆశలు చిగురించడంతో అభ్యర్థికి ఆర్థికంగా భరోసా ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో చీపురుపల్లి నియోజకవర్గంలో రెండు మేజర్ పంచాయతీ స్థానాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ స్థానాల్లో గెలిచిన పార్టీనే వచ్చే ఎమ్మెల్యే ఎన్నికల్లో హవా చూపే అవకాశం ఉండటంతో అందరి దృష్టి కేంద్రీకృతమైంది. మరోవైపు సీనియర్ నేత బొత్స, ఆయన మేనల్లుడు చిన్నశ్రీను రాజకీయ భవిష్యత్తు కూడా ఈ రెండు పంచాయతీలే నిర్దేశించనున్నాయని అంటున్నారు.

ఏపీ కాంగ్రెస్ లో ఏం జరుగుతోంది...రాహుల్ నజర్

ఏపీలో కాంగ్రెస్ ఉనికిపై మరోసారి చర్చ మొదలైంది. స్థానిక ఎన్నికల్లో పార్టీ ప్రభావం చూపలేకపోవడం, షర్మిల జగన్‌తో వ్యక్తిగత వివాదాలకే ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. టీడీపీ మద్దతు అంశం కూడా చర్చకు దారితీస్తోంది. ఈ నేపథ్యంలో ఏపీపై రాహుల్ గాంధీ ప్రత్యేక దృష్టి పెడతారనే ప్రచారం ఆసక్తికరంగా మారింది. ఏపీలో కాంగ్రెస్ పార్టీ ఉందా అన్నది ఒక చర్చ అయితే ఆ పార్టీ పోరాటం ఎవరి మీద చేస్తోంది మరో చర్చ. అసలు ఈ పోరాటాలు అన్నీ ఆరాటాలేనా సొంత అజెండా వ్యక్తిగత లక్ష్యాలు కక్షలేనా అన్నది మరో కీలక ప్రశ్న. ఇవన్నీ కూడా ఏపీ కాంగ్రెస్ లో ఇంకా మిగిలి ఉన్న నిబద్ధత కలిగిన సీనియర్ నేతల నుంచి వస్తున్న సందేహాలు. అలాగే అసలు పార్టీలో ఏమి జరుగుతోంది అన్నది కూడా ఆందోళన కలిగించే వ్యవహారంగా చెబుతున్నారు. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్న వైఎస్ షర్మిల వైసీపీ అధినేతగా ఉన్న వైఎస్ జగన్ ల మధ్య జరుగుతున్న వ్యక్తిగత వ్యవహారాలు ఆస్తులకు సంబంధించిన వివాదాలు ఇవన్నీ కాంగ్రెస్ పార్టీకి అవసరమా అన్నది కూడా మరో చర్చ. ఏపీలో చూస్తే కాంగ్రెస్ స్థానిక సంస్థల ఎన్నికల్లో పెద్దగా ఉనికి చూపించింది ఏమీ లేదని విమర్శ ఉంది.

గుడ్డిలో మెల్లగా :

ఇక ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని చీరాలలో మాత్రం కాంగ్రెస్ కాస్తా కనిపించింది అంటే అది మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణ మోహన్ క్రెడిట్ లోకే వెళ్తుందని అంటారు. ఆయన తన సొంత బలంతోనే కాంగ్రెస్ ని అక్కడా కొద్దో గొప్పో నిలబెట్టగలిగారు. అది తప్పించి మొత్తం ఏపీ వ్యాప్తంగా కాంగ్రెస్ పోటీ చేసినా సోదిలోకి లేకుండా పోయింది అని అంటున్నారు. పీసీసీ చీఫ్ హోదాలో షర్మిల కాంగ్రెస్ ని పట్టించుకోలేదని కూడా



విమర్శలు ఉన్నాయి. ఇవన్నీ కూడా అసలైన కాంగ్రెస్ పార్టీ అభిమానులకు ఆవేదన కలిగిస్తున్నాయని అంటున్నారు.

డీకే సీఎం గా :

ఇక కర్ణాటకలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి డీకే శివ కుమార్ ఉన్నారు. ఆ రాష్ట్రంలో షర్మిల పీసీసీ చీఫ్ గా ఉంటూ యలహంక ప్యాలెస్ లోకి వెళ్లాలని ప్రయత్నాలను అక్కడి పోలీసులు అడ్డుకోవడం కూడా చర్చనీయాంశం అవుతోంది. తమ సొంత పార్టీకి చెందిన పీసీసీ చీఫ్ అయినా కోర్టు ఆదేశాలను అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడానికే మొగ్గు చూపిందని కూడా గుర్తు చేస్తున్నారు. ఇక బెంగళూరు యలహంక ప్యాలెస్ చుట్టూ సాగుతున్న వివాదం ఇవన్నీ కూడా అక్కడి ప్రభుత్వానికి తెలియనివి కావని అంటున్నారు. ఆ విధంగా కాంగ్రెస్ పెద్దలకు ఫీడ్ బ్యాక్ వెళ్లే ఉంటుందని కూడా చెబుతున్నారు.

టీడీపీ మద్దతు మీద :

ఇక కాంగ్రెస్ నాయకురాలిగా ఉన్న షర్మిలకు టీడీపీ మద్దతుగా నిలవడం మీద కూడా చర్చ సాగుతోంది. చంద్రబాబుకు పెళ్ళి కార్డు షర్మిల అందించారు అన్న దాని మీద వైసీపీ సొంత మీడియా కధనాలు రాసింది. దాని మీద తప్పేముంది అని మాట్లాడటం వరకూ టీడీపీ పెద్దలు ఓకే కానీ అంతకు మించి అన్నట్లుగా షర్మిలకు మద్దతుగా నిలవడం టీడీపీ సొంత మీడియా కూడా ఆమె వైపు ఉండడం ఇవన్నీ చూసిన వారికి కేంద్రంలో ఎన్డీయే మీద కాంగ్రెస్ పోరాదుతూంటే ఏపీలో ఎన్డీయే మీద కాంగ్రెస్ ఏ మేరకు పోరాటం చేస్తోంది అన్నది కూడా చర్చిస్తున్నారు.

ఏం చేస్తారు :

దేశమంతా కాంగ్రెస్ గాలులు వీస్తున్నాయని దానిని అందిపుచ్చుకోవాలని జాతీయ స్థాయిలో ఆ పార్టీ పెద్దలు ప్రవచిస్తున్నారు మరి ఏపీలో కాంగ్రెస్ గాలి లేదా లేక వచ్చినా పట్టించుకోవడం లేదా లేక కాంగ్రెస్ నే ఏకంగా గాలికి వదిలేశారా అన్నది కూడా చర్చ సాగుతోంది. మరి ఏపీ మీద కాంగ్రెస్ ఫోకస్ పెడుతుందని కూడా మరోసారి చర్చ సాగుతోంది. అది భారీ మార్పులకు దారి తీస్తుందా లేక ఇంకా ఏమైనా జరుగుతుందా అనంది అయితే తెలియరావడం లేదు కానీ ఏపీ వైపు రాహుల్ గాంధీ చూపు ఉందని అంటున్నారు. ఈ ప్రచారంలో నిజమెంత అన్నది చూడాల్సి ఉంది.

ఇలాగైతే ఎలా సారూ...కేసీఆర్ ది వ్యూహమా ?

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు రెండేళ్లే సమయం ఉండగా, సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటనలతో ప్రజల్లోకి వెళ్తున్నారు. కేటీఆర్, హరీష్ రావు పార్టీని బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు కేసీఆర్ మాత్రం ఇప్పటికీ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారనే విమర్శలు వస్తున్నాయి. ఎన్నికలకు ఆరు నెలల ముందే జనంలోకి రావాలన్న కేసీఆర్ వ్యూహం ఎంతవరకు పనిచేస్తుందన్న చర్చ సాగుతోంది.

వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అవుతారు అని బీఆర్ఎస్ నేతలు పదే పదే చెబుతున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అయితే ఇదే మాట అంటున్నారు. హరీష్ రావు అదే ధీమాను ప్రదర్శిస్తున్నారు. అంతా బాగానే ఉంది కానీ తెలంగాణలో సార్వత్రిక ఎన్నికలు జరిగి మూడేళ్ళు అయింది. అచ్చంగా మరో రెండేళ్ల కాలం మాత్రమే అసెంబ్లీ ఎన్నికలకు ఉంది. ఈ మూడేళ్ళలో కేసీఆర్ ఎక్కడా బయటకు వచ్చింది పెద్దగా లేదని అంటున్నారు. అంతే కాదు ఆయన అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు. కానీ సభకు కూడా రావడం లేదు. కేసీఆర్ కేరాఫ్ ఫాం హౌస్ అని కాంగ్రెస్ నేతలు ఎద్దేవా చేస్తూనే ఉన్నారు. ఇంతలో మూడేళ్ళు ఇట్టే తిరిగిపోయాయి.

జనంలోకి రేవంత్ :

ఇదిలా ఉంటే జనంలోనే నిత్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉంటున్నారు. సీఎం గా ఆయనకు అధికారిక కార్యక్రమాలు ఎటూ ఉంటాయి. అయితే ఆయన అనేక జిల్లాలలో అధికారిక కార్యక్రమాలను నిర్వహిస్తూ జనాలకు కాంగ్రెస్ చేసిన మేలు చెబుతున్నారు. అదే సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగిన నష్టాన్ని వివరిస్తున్నారు. అంతే కాదు



వారసత్వ రాజకీయాలను ఎండగడుతున్నారు. లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్ ని పూర్తిగా తప్పుపడుతున్నారు. తెలంగాణకు అది గుదిబండగా మారింది అంటున్నారు. మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని అటు క్యాడర్ లోనూ ఇటు జనాల్లోనూ ధీమా పెరిగేలా చేస్తున్నారు. ఇక సంక్రాంతి తరువాత జిల్లాల టూర్లు రేవంత్ రెడ్డి పెట్టుకుంటున్నారు. అలా ఎన్నికలకు రెండేళ్ళ ముందే రాష్ట్రమంతా చుట్టేయాలని ఆయన భారీ ప్లాన్ తోనే ఉన్నారు. అదే సమయంలో బలమైన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ అయితే తన గ్రాఫ్ ని ఏ మేరకు పెంచుకుంది అన్నదే చర్చకు వస్తున్న విషయం.

జోడు గుర్రాలుగా :

ఇక కేసీఆర్ అయితే ఫాం హౌస్ లో ఉన్నారు కానీ కేటీఆర్ హరీష్ రావు జనంలోనే ఉంటూ పార్టీని పటిష్టం చేసే పనిని గట్టిగానే తీసుకున్నారు. అసెంబ్లీలో అయినా లేదా జనంలో అయినా లేదా పార్టీ ఆఫీసుల్లో అయినా ఈ ఇద్దరు నేతలు జోడు గుర్రాల మాదిరిగా ఉంటూ బీఆర్ఎస్ ని లేపడానికి చూస్తున్నారు. అయితే వారు ఎంత కష్టపడుతున్నా కూడా గులాబీ పార్టీ గ్రాఫ్ అనుకున్న స్థాయిలో పెరుగుతోందా అన్నదే చర్చగా ఉంది. రేవంత్ రెడ్డి దూకుడు ముందు అయితే బీఆర్ఎస్ జోడీ తేలిపోతోంది అన్నది కూడా విశ్లేషణగా ఉంది. కేసీఆర్ అవతల వైపు ఉంటేనే మజా ఉంటుందని అంటున్నారు.

గులాబీ బాస్ స్ట్రాటజీ :

ఇక చూస్తే కేసీఆర్ సరిగ్గా ఎన్నికలకు ఆరు నెలల ముందు జనంలోకి రావాలనుకుంటున్నారా అన్నది చర్చగా ఉంది. అపుడు వస్తే ఊపు వస్తుందని కూడా భావిస్తున్నారు అని అంటున్నారు. అప్పటికి ఎన్నికల మూడ్ వస్తుందని జనాలు చెప్పేది పూర్తిగా వింటారు అని కూడా ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. అయితే ఇవన్నీ ఓల్డ్ స్ట్రాటజీస్ అని మరో మాట వినిపిస్తోంది. గతంలోలా ఎన్నికల ముందు వస్తే జనాలు టర్న్ కావడం లేదని కూడా గుర్తు చేస్తున్నారు. కనీసం రెండేళ్ల ముందు అయినా జనంలోకి వస్తేనే ప్రజలు కూడా ఆలోచిస్తారని ఎన్నికల హడావుడిలో ఎంత చెప్పినా అది రాజకీయ చర్చగానే ఉంటుందని కూడా అంటున్నారు. అయితే కేసీఆర్ మాత్రం ఇప్పటప్పట్లో వచ్చేది లేదనే అంటున్నారు. మరి చూడాలి బీఆర్ఎస్ కొత్త ఎత్తుగడలు ఏ విధంగా ఉండబోతున్నాయో.

జనసేన బలపడినట్లేనా ?

2019లో ఒక్క ఎమ్మెల్యేతో ప్రస్థానం ప్రారంభించిన జనసేన.. 2024లో 21 ఎమ్మెల్యేలు, రెండు ఎంపీ స్థానాలు సాధించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ 487 వార్డులు, 73 జెడ్పీటీసీలు, 938 ఎంపీటీసీలు గెలుచుకుంది. పలు మేయర్, ఎంపీపీ, వైస్ చైర్మన్ పదవులూ దక్కించుకుంది. కూటమిలో కొనసాగుతూనే రాష్ట్రవ్యాప్తంగా పార్టీని విస్తరించడంపై పవన్ వ్యూహాలు రచిస్తున్నారు.ఏపీలో జనసేన బలపడినట్లేనా. ఈ ప్రశ్న రాజకీయ విశ్లేషకులు కూడా వేసుకుని తరచి చూస్తున్నారు. ఇక జనసేనలో కూడా దీని మీద చర్చ సాగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలలో జనసేనకు పొత్తులలో దక్కిన సీట్లలో గెలుపు బాట పట్టారు. అలాగే విశాఖ వంటి చోట్ల డిప్యూటీ మేయర్ పదవితో పాటు 26 మంది కార్పోరేటర్లు గాజు గ్లాస్ పార్టీకి దక్కాయి. విజయవాడ, ఏలూరు మేయర్ సీట్లు లభించాయి. అలాగే జనసేనకు జిల్లా పరిషత్తులు అయిదు దాకా సొంతం అయ్యాయి. మునిసిపాలిటీలు తీసుకుంటే జనసేనకు దక్కినవి పోటీ చేసిన 15 మున్సిపాలిటీలు 3 నగర పంచాయతీలు ఖాతాలో పడ్డాయి.

గ్రౌండ్ లెవెల్ లో :

ఇక రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన 100 పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించి 3 వేల 942 వార్డులలో ఎన్నికల్లో జనసేన మొత్తం 487 వార్డుల్లో విజయం సాధించింది. జెడ్పీటీసీలు ఎంపీటీసీలు చూసుకుంటే జనసేన గెలుచుకున్నవి 73 జెడ్పీటీసీ 938 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఇక ఏకగ్రీవమైన స్థానాలతో కలిపితే జనసేన మొత్తం బలం మరింత ఎక్కువగా ఉంది. ఎంపీపీ పదవులు కూడా జనసేనకు దక్కినవి 42 ఎంపీపీ పదవులు 83 వైస్ ఎంపీపీ పదవులు దక్కాయి. జెడ్పీలలో వైఎస్ చైర్మన్లు జనసేనకు 5 దాకా లభించాయి. ఇక మునిసిపాలిటీలలో 18 వైఎస్ చైర్ పర్సన్ పదవులు కూడా ఆ పార్టీ అందుకుంది. ఇక రెండవ విడతలో జరితే 23 పట్టణాలలో జనసేనకు కీలకమైన సీట్లు దక్కే చాన్స్ ఉంది.

పంచాయతీలు సైతం :

అదే విధంగా ఏపీలో 13 వేల పై చిలుకు ఉన్న పంచాయతీలలో కూడా జనసేనకు భారీగానే అవకాశాలు దక్కుతాయని అంటున్నారు. మొత్తంగా చూస్తే 2019లో కేవలం ఒక ఎమ్మెల్యేతో తన అధికార ప్రయాణాన్ని ప్రారంభించిన జనసేన 2024 ఎన్నికల్లో పొత్తు పెట్టుకుని 21 ఎమ్మెల్యేలు రెండు లోక్ సభ, ఒక రాజ్యసభ, రెండు ఎమ్మెల్సీలు, అలాగే పలు నామినేటెడ్ పోస్టులు దక్కించుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో మరింతగా పటిష్టం అయింది అని అంటున్నారు.

అసంతృప్తి ఉందా :

అయితే జనసేన ఒక రాజకీయ పార్టీగా పూర్తి స్థాయిలో ఎదగాలని చూస్తోంది. ఆ పార్టీ కూడా వైసీపీ టీడీపీ మాదిరిగా రాష్ట్రమంతా విస్తరించి ఏదో నాటికి ఏపీలో అధికారం అందుకోవాలని ఆలోచిస్తోంది. మరీ ముఖ్యంగా క్యాడర్ లో ఈ భావన అధికంగా ఉంది. అయితే జనసేనకు కూటమిలో టీడీపీ తరువాత ప్రాధాన్యత బాగానే లభిస్తోంది అని అంటున్నారు. కానీ రాజకీయ పార్టీలకు ఆకాంక్షలు ఉంటాయి కాబట్టి ఇది చాలదనే చర్చ ఎపుడూ ఉంటుంది. అదే సమయంలో జనసేన బలం ఇంకా ఎక్కువగా ఉందని కూడా చర్చ సాగుతోంది. సోషల్ మీడియాలో చూస్తే ఈ రకమైన పోస్టులు కనిపిస్తాయి. నిజంగా జనసేనకు ఎక్కువగానే బలం ఉండొచ్చు కానీ కూటమిలో పొత్తుల ధర్మంతోనే ఈ పోటీ చేసింది అన్నది కూడా గుర్తుంచుకోవాలని అంటున్నారు.

పవన్ వ్యూహాత్మకంగానే :

ఇక అధినేత పవన్ వ్యూహాత్మకంగానే ముందుకు సాగుతున్నారు. ఆయన నెమ్మదిగానే పార్టీని విస్తరించుకుని వెళ్తున్నారు. 2019 నుంచి 2026 దాకా సాగిన ఏడేళ్ల జనసేన అధికార ప్రయాణంలో ఇన్ని పదవులు ఈ గ్రోత్ అన్నది నిజంగా హర్షించతగినదే అని అంటున్నారు. కానీ ఇక్కడితో ఆగిపోకూడదు అన్నది కూడా ఉంది. అదే సమయంలో రాష్ట్రంలో రాజకీయాలను విపక్షంలో ఉన్న వైసీపీని రాష్ట్ర అభివృద్ధిని అన్నింటినీ దృష్టిలో ఉంచుకునే జనసేన తగిన విధంగా వ్యవహరిస్తోంది అని అంటున్నారు. పవన్ కూడా వ్యూహాత్మకంగానే అడుగులు వేస్తున్నారు అని చెబుతున్నారు. కూటమితో కొనసాగుతూనే జనసేన మరింతగా ఎలా విస్తరించాలి అన్నది జనసేన అధినాయకత్వం కార్యాచరణ రూపొందించుకుంటోందని చెబుతున్నారు. ఏది ఏమైనా ఇపుడు చూస్తే ఏపీలో టీడీపీ తరువాత ఎక్కువగా అధికార పదవులు జనసేనకే ఉన్నాయి. అలా వైసీపీని మూడవ ప్లేస్ లోకి పంపించారనే అంటున్నారు.

వంగవీటి రాధాక్రిష్ణన్...ఈ కొత్త పేరేంటి ?



విజయవాడ మేయర్‌గా ప్రమాణ స్వీకారం సందర్భంగా వంగవీటి రాధా తన పూర్తి పేరు 'వంగవీటి రాధాకృష్ణన్' అని పలకడంతో అందరిలో ఆసక్తి మొదలైంది. చిన్నప్పుడు ఊటీలో చదువుకున్న సమయంలో పాఠశాల రికార్డుల్లో తమిళ శైలిలో పేరు చివర 'న్' చేరింది. అప్పటి నుంచి విద్యా ధ్రువపత్రాలు, పాస్‌పోర్ట్, ఎన్నికల అఫిడవిట్లలో అదే పేరు కొనసాగుతోంది. అందుకే ప్రమాణ స్వీకారంలో అధికారిక పేరును ఉపయోగించారు.వంగవీటి రాధా క్రిష్ణ అంటే అందరికీ తెలుసు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా 2004లో గెలిచిన రాధా క్రిష్ణ దివంగత నేత వంగవీటి రంగా కుమారుడు అన్నది ఇంకా బాగా తెలుసు. షార్ట్ కట్ లో రాధా అని కూడా బాగా పాపులర్. కానీ విజయవాడ మేయర్ గా ఆయన ప్రమాణం చేస్తున్నప్పుడు తన పేరు వంగవీటి రాధాకృష్ణన్ అని పలికారు. దాంతో సభలో ఉన్న వారు ఏమిటి ఆయన తప్పు చదువుతున్నారా లేక తాము తప్పుగా విన్నామా అన్న డౌట్ లో పడిపోయారు. అయితే రాధా తన పేరుని కరెక్ట్ గానే చదివారు అని అంతా కరెక్ట్ గానే విన్నారు అన్నది తరువాత తెలిసింది. మరి రాధా క్రిష్ణ అన్న తెలుగు పేరు కదా ఈ తమిళ్ కలిసిన క్రిష్ణన్ అన్న పేరు ఎలా వచ్చింది అన్నదే ఇపుడు అంతా ఆలోచిస్తున్నారు. అయితే ఈ పేరు వెనక ఒక స్టోరీ ఉంది. అది ఇంట్రెస్టింగ్ గానే ఉంది.

ప్రభుత్వ రికార్డులలో :

జనాలందరికీ రాధా క్రిష్ణగా పేరుతో పరిచయం ఉన్నా ఆయన పూర్తి పేరు వంగవీటి రాధాక్రిష్ణన్. అలాగే ఆయన పేరు ప్రభుత్వ రికార్డుల్లో ఉంది. అందుకే విజయవాడ నగర పాలక సంస్థ నూతన మేయర్‌గా ఆయన ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా వంగవీటి రాధాకృష్ణన్ అనే నేను అని పలికారు. అయితే ఈ కొత్త పేరుపై చర్చ అంతటా మొదలైంది. కానీ దీని వెనుక ఉన్న అసలు కారణం ఉంది. స్కూల్ రికార్డుల ప్రకారం అదే పేరు ఉంది. రాధా తల్లిదండ్రులు మొదట వంగవీటి రాధాకృష్ణ అనే పేరు పెట్టారు. అది రాధా పెద నాన్న పేరు. అయితే రాధాని ఆయన చిన్నతనంలో తమిళనాడులోని ఊటీలో పాఠశాలలో చదివించారు. అలా ఆయన చదువుకునే సమయంలో అక్కడ పాఠశాల అధికారులు తమిళ శైలిలో ఆయన పేరు చివర 'న్' చేర్చి రాధాకృష్ణన్ గా స్కూల్ రికార్డులలో నమోదు చేశారు.

అదే పేరు కొనసాగుతోంది :

ఆ తరువాత అదే కొనసాగుతూ అధికారిక ధృవపత్రాలలోనూ ఉంది. అప్పటి నుంచి ఆయన చదువుకున్న సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్, ఎన్నికల అఫిడవిట్లు ఇతర ప్రభుత్వ రికార్డులన్నింటిలోనూ అదే పేరు కొనసాగుతోంది. ఇక బయట ప్రజలకు, రాజకీయ వర్గాలకు ఆయన వంగవీటి రాధా లేదా రాధాకృష్ణగా సుపరిచితులైనప్పటికీ, చట్టపరమైన నిబంధనల ప్రకారం మేయర్ ప్రమాణ స్వీకారంలో తన అధికారిక పేరునే ఉపయోగించారు. అదన్న మాట సంగతి. మొత్తం మీద చూస్తే వంగవీటి రాధా క్రిష్ణన్ అన్నది ఆయన అసలు పేరు అని మేయర్ ప్రమాణం సందర్భంగా అంతా సరి కొత్తగా తెలుసుకున్నారు. దేశ ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాక్రిష్ణన్ ఉన్నారు. అలాగే . ఇపుడు విజయవాడ మేయర్ గా రాధాక్రిష్ణన్ ఉన్నారు అని అంతా అంటున్నారు. తమిళనాడులో పుట్టి దేశానికి రాష్ట్రపతి అయిన రాధాక్రిష్ణన్ స్ఫూర్తితో అనేక మంది ఆ పేరుని పెట్టుకుంటారు ఇది ఎక్కువగా తమిళనాడులో జరుగుతుంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

తిరుపరంకుండ్రం వివాదం : ఒకే కొండ.. రెండు విశ్వాసాలు.. ఓ కార్తీక దీపం వెనుక దాగిన అసలు కథ



తమిళనాడులోని మదురై తిరుపరంకుండ్రం కొండపై కార్తీక దీపం వెలిగించే అంశం వివాదంగా మారింది. దర్గాకు సమీపంలోని రాతి స్తంభం తమ సంప్రదాయ దీపస్తంభమని హిందూ సంఘాలు వాదిస్తుండగా, అది బ్రిటిష్ కాలం నాటి సర్వే గుర్తు అని ప్రభుత్వం చెబుతోంది. మద్రాస్ హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ అప్పీళ్ల నేపథ్యంలో వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. భక్తి విశ్వాసాలు, శాంతిభద్రతల మధ్య వివాదం కొనసాగుతోంది.తమిళనాడులోని మదురై గడ్డపై నిశ్శబ్దంగా నిలబడి ఉన్న ఆ కొండకు వందల ఏళ్ల చరిత్ర ఉంది. ఒకవైపు భక్తుల 'హరోంహర' నామస్మరణతో మార్మోగే సుబ్రహ్మణ్య స్వామి ఆలయం.. మరోవైపు శాంతి సందేశాన్ని వినిపించే సికిందర్ బాదుషా దర్గా.. తరతరాలుగా భిన్న మతాల విశ్వాసాలకు నిలయంగా.. సామరస్యానికి ప్రతీకగా నిలిచిన తిరుపరంకుండ్రం కొండ నేడు దేశవ్యాప్తంగా ఒక పెద్ద చర్చకు.. ఉద్వేగభరితమైన వివాదానికి కేంద్రబిందువుగా మారింది. అసలు ప్రశాంతంగా ఉండే ఆ కొండపై ఇంతటి రచ్చ ఎందుకు మొదలైంది? ఒక చిన్న కార్తీక దీపం చుట్టూ ఇంతటి న్యాయపోరాటం ఎందుకు జరుగుతోంది?

ప్రతి ఏటా కార్తీక పౌర్ణమి వచ్చిందంటే చాలు.. ఆ కొండపై ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తుంది. సాధారణంగా అక్కడి ఉచ్చి పిళ్లయార్ ఆలయం వద్ద మహాదీపం వెలిగించడం ఆనవాయితీ. కానీ అసలు చిక్కంతా కొండ శిఖరాన దర్గాకు సమీపంలో ఉన్న ఒక పురాతన రాతి స్తంభం దగ్గరే మొదలైంది. ఆ రాతి స్తంభం తమ పూర్వీకులు ఏర్పాటు చేసిన పవిత్ర 'దీపస్తంభం' అని.. అక్కడ కార్తీక దీపం వెలిగించడం తమ తరతరాల హక్కు, సంప్రదాయమని హిందూ సంఘాలు, భక్తులు బలంగా వాదిస్తున్నారు. తమ విశ్వాసాన్ని కాపాడుకోవాలని వారు తపిస్తున్నారు. తమిళనాడు ప్రభుత్వం మాత్రం ఇందుకు భిన్నమైన వాదనను వినిపిస్తోంది. అది దీపస్తంభం కాదని.. బ్రిటిష్ పాలన కాలంలో భౌగోళిక కొలతల కోసం ఏర్పాటు చేసిన 'గ్రేట్ ట్రిగోనోమెట్రికల్ సర్వే' గుర్తు అని స్పష్టం చేస్తోంది. అంతేకాకుండా దర్గాకు అతి సమీపంలో దీపం వెలిగించడం వల్ల అనవసరమైన మతపరమైన ఉద్రిక్తతలు తలెత్తుతాయని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది కొండపై మాంసాహారం తిన్నారనే ఆరోపణలు రావడంతో నివురుగప్పిన నిప్పులా ఉన్న ఈ వివాదం ఒక్కసారిగా భగ్గుమంది. కొండపైకి భక్తుల రాకపోకలపై ఆంక్షలు విధించడంతో తమ సంప్రదాయ హక్కుల కోసం భక్తులు న్యాయపోరాటానికి దిగారు. దీపస్తంభం వద్ద దీపం వెలిగించేందుకు మద్రాస్ హైకోర్టు అనుకూలంగా తీర్పునివ్వడంతో భక్తుల్లో ఆశలు చిగురించాయి. కానీ క్షేత్రస్థాయిలో ఆ ఆదేశాలు అమలు కాకపోవడంతో కోర్టు ధిక్కరణ పిటిషన్లు.. ప్రభుత్వ అప్పీళ్లతో ఈ వ్యవహారం ఏకంగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు గడప తొక్కింది. పరిస్థితి తీవ్రతను గమనించిన సుప్రీంకోర్టు.. కార్తీక పౌర్ణమి నాడు కేవలం ఒక్కసారి మాత్రమే.. కఠినమైన షరతుల మధ్య దీపం వెలిగించేందుకు మధ్యంతర అనుమతి ఇచ్చింది. సాధారణ భక్తులు.. రాజకీయ నాయకులు లేకుండా కేవలం ఆలయ, ప్రభుత్వ అధికారులు మాత్రమే ఆ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించింది. అయితే ఈ తీర్పుపైనా తమిళనాడు ప్రభుత్వం రివ్యూ పిటిషన్ దాఖలు చేయడంతో ఈ వివాదం మరింత ఉత్కంఠను రేపుతోంది. నేడు తిరుపరంకుండ్రం కొండపై జరుగుతున్న ఈ పోరాటం కేవలం ఒక దీపం వెలిగించడమా లేదా అనే చిన్న అంశం కాదు. ఇదొక భావోద్వేగపూరితమైన సంక్లిష్ట సమస్య. ఒకవైపు తరతరాల మత విశ్వాసాలు.. ఆచారాలను కాపాడుకోవాలనే భక్తుల ఆరాటం.. మరోవైపు సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకూడదనే ప్రభుత్వ బాధ్యత.. ఆ రాతి స్తంభం అసలు చరిత్ర ఏమిటి? భక్తికి, చట్టానికి మధ్య న్యాయస్థానాలు ఎలాంటి సమతుల్యతను చూపిస్తాయి? కాలమే ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. ఆ కొండపై వెలిగే దీపం మనుషుల మధ్య చిచ్చు పెట్టకుండా.. శాంతి కాంతులను విరజిమ్మాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు.

పూరీ బీచ్‌లో విదేశీ మహిళల కార్తీక దీపోత్సవం..



కార్తీక పౌర్ణమి సందర్భంగా పూరీ నీలాద్రి బీచ్‌లో విదేశీ మహిళలు 'బోయిత వందన' ఆచారంలో పాల్గొని సముద్రంలో దీపాలు వదిలారు. కళింగ నావికుల సముద్రయాన సంప్రదాయానికి గుర్తుగా జరుపుకునే ఈ వేడుకకు సంబంధించిన వీడియోను సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ షేర్ చేయడంతో వైరల్‌గా మారింది.మన దేశపు సంస్కృతి, సంప్రదాయాలకు ఉండే పవర్ వేరే లెవల్. మనమే కాస్త మోడ్రన్ పేరుతో పాత ఆచారాలను మర్చిపోతుంటే, విదేశీయులు మాత్రం వాటిని ఎంతో భక్తితో, ఇష్టంతో ఫాలో అవుతున్నారు. తాజాగా కార్తీక పౌర్ణమి సందర్భంగా ఒడిశాలోని పూరీ నీలాద్రి బీచ్‌లో విదేశీ మహిళలు కార్తీక దీపాలు వదులుతున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ప్రముఖ సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ షేర్ చేసిన ఈ వీడియో వెనుక ఉన్న ఆసక్తికర విషయాలేంటో చూద్దాం..

సముద్ర తీరంలో 'బోయిత వందన' సందడి:

కార్తీక పౌర్ణమి రోజు సూర్యోదయానికి ముందే పూరీ నీలాద్రి బీచ్ దీపాల వెలుగులతో మెరిసిపోయింది. స్థానిక మహిళలతో పాటు అక్కడికి వచ్చిన విదేశీ పర్యాటకులు కూడా అరటి దొప్పలు, కాగితాలతో చేసిన చిన్న పడవల్లో తమలపాకులు, పూలు, దీపాలు పెట్టి సముద్రంలో వదిలారు. ఇక ఒడిశాలో దీనిని 'బోయిత వందన' అని పిలుస్తారు. మన ఆచారాన్ని వాళ్లు ఎంతో ఆసక్తిగా నేర్చుకుని చేయడం చూస్తుంటే ముచ్చటేస్తోంది.

ఈ ఆచారం వెనుక ఉన్న చరిత్ర ఏంటి?:

కేవలం దీపాలు వదలడం మాత్రమే కాదు, దీని వెనుక ఒక గొప్ప చరిత్ర ఉంది. పూర్వం కళింగ నావికులు (సాధబాలు) వ్యాపారం కోసం బాలి, జావా, సుమత్రా లాంటి దేశాలకు సముద్ర ప్రయాణాలు చేసేవాళ్లు. వాళ్ల ప్రయాణాలు క్షేమంగా సాగాలని ఆ రోజుల్లో మహిళలు ఇలా చిన్న పడవల్లో దీపాలు పెట్టి సముద్రంలో వదిలేవాళ్లు. ఆ జ్ఞాపకార్థమే ఇప్పటికీ ఒడిశాలో ఈ వేడుకను ఘనంగా జరుపుకుంటారు.

మన ఆచారాలకు పెరుగుతున్న గ్లోబల్ క్రేజ్:

ఇప్పుడున్న జనరేషన్‌లో చాలామందికి మన పండగల వెనుక ఉన్న అసలు అర్థాలు తెలియడం లేదు. కానీ విదేశాల నుంచి వచ్చిన టూరిస్టులు మాత్రం మన సంప్రదాయాల గురించి తెలుసుకుని, అందులో భాగం కావడానికి ఎంతో ఉత్సాహం చూపిస్తున్నారు. సుదర్శన్ పట్నాయక్ అన్నట్టు, విదేశీయులు సైతం మన కల్చర్‌ను ఇంతలా ప్రేమించడం మనందరికీ గర్వకారణం.

ఇదొక అద్భుతమైన దృశ్యం:

పూరీ బీచ్‌లో ఆ విదేశీ మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో దీపాలు వదులుతున్న దృశ్యం కళ్లకు కట్టినట్టుగా ఉంది. దేశాలు, భాషలు వేరైనా మంచి సంప్రదాయం ఎక్కడున్నా అందరినీ కలుపుతుందని ఈ వీడియో మరోసారి నిరూపించింది. అందుకే ఈ వీడియో నెటిజన్ల మనసు గెలుచుకుని ఇంతలా వైరల్ అవుతోంది.

ఆంధ్రప్రదేశ్ ని వెంటాడుతున్న తుపాన్లు.. భయపెడుతున్న తీరం



నవంబర్ నెలాఖరుకు బంగాళాఖాతంలో తుపాను ఏర్పడే అవకాశం ఉంది. డిసెంబర్ మొదటి వారం తర్వాత మరో తుపాను వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. వాతావరణ పరిస్థితులు ఇలాగే కొనసాగితే మూడో వ తుపాను కూడా ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. నెలాఖరులో అండమాన్‌లో అల్పపీడనం ఏర్పడే సూచనలు ఉన్నట్లు డిసెంబర్ నాలుగు తర్వాత తుపానుగా మారే అవకాశం ఉందని చెప్పింది. డిసెంబర్ రెండో వారంలో మరో తుపాను ముప్పు చెప్పింది. ఆంధ్రప్రదేశ్ తో పాటు ఐదు రాష్ట్రాలకు తుపాను హెచ్చరికలు ఉంటాయన్న సంకేతాలు వినిపిస్తున్నాయి. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల పెరుగుదలతో తుపానులు, వరుస తుపానులతో తీర ప్రాంతాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఇప్పటికే ఏపీకి మూడు తుపాన్లు వచ్చి ఇబ్బందులు పెట్టాయి. ఇంకా మూడు తుపాన్లు వస్తాయన్న అంచనాలు ఏపీ తీర ప్రాంత ప్రజల్లో గుండెల్లో రైళ్లు పరుగులు పెడుతున్నాయి.

రేపటి నుంచి నాలుగు రోజులు వర్షాలు...

నేడు ఆంధ్రప్రదేశ్‌లో పలు చోట్ల వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కు అమరావతి వాతావరణ శాఖ వర్ష సూచన చేసింది. తీర ప్రాంతాలతో పాటు పలు చోట్ల చెదురుమదురు లేదా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఉదయం వేళల్లో పొగమంచు ఎక్కువగా కనిపిస్తోంది.ఇక అమరావతి, విజయవాడ, నెల్లూరు, ఒంగోలు, విశాఖపట్నం ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సుమారు 27 డిగ్రీల నుంచి 28 డిగ్రీల వద్ద పాక్షిక మేఘావృతం లేదా ఎండగా ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇక ఈ నెలలో, డిసెంబరు నెలలో మరో మూడు తుపాన్లు వచ్చే అవకాశముందని అంచనాలు వినపడుతుండటంతో ప్రధానంగా రైతాంగంలో ఆందోళన వ్యక్తమవుతుంది. ఇప్పటికే చేతికొచ్చిన పంటలు అందకుండా పోయాయి. వాణిజ్య పంటలు దక్కకుండా పోయాయి. తీవ్ర ఆర్థిక నష్టంతో ఉన్న తాము ఇక సాగు చేయకపోవడమే మంచిదన్న అభిప్రాయానికి అన్నదాత వచ్చినట్లు కనపడుతుంది. మరొకవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సాయం కూడా అందడం లేదు. వర్షాలపై భారత వాతావరణ శాఖ శుభవార్త చెప్పింది.బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి వల్ల కోస్తాంధ్ర, రాయలసీమలో రేపటి నుంచి నాలుగు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారి తెలిపారు. ద్రోణి తీరాన్ని తాకిందని, ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని పేర్కొన్నారు. అలాగే గరిష్ఠంగా గంటకు 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వివరించారు.

తెలంగాణలో పొడి వాతావరణం...

తెలంగాణలో పొడి వాతావరణం నెలకొని ఉంటుందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తెలంగాణలో చలి తీవ్రతతో పాటు మేఘావృత వాతావరణం నెలకొంది. ఆంధ్రప్రదేశ్ తో పోలిస్తే చలి తీవ్రత ఎక్కువగా ఉంది. సంగారెడ్డి వంటి ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్ కు పడిపోయాయి. సాధారణంగా గరిష్ట ఉష్ణోగ్రతలు 30 డిగ్రీల నుంచి 32 డిగ్రీల మధ్య, కనిష్ట ఉష్ణోగ్రతలు 18 డిగ్రీల నుంచి 20 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. హైదరాబాద్ లో ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. సాయంత్రం వేళ ఉష్ణోగ్రత సుమారు 27 డిగ్రీల వద్ద పొడిగా ఉంటుందని చెప్పింది. అయితే ఎక్కడా వానలు పడే అవకాశం లేదని చెప్పింది. చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు బయటకు రావడానికి కూడా భయపడుతున్నారు. ప్రధానంగా వృద్ధులు, దీర్ఘకాలిక రోగులు, అస్థ్మా వంటి రోగాలున్న వారు చలికి బయటకు రాకుండా ఉండాలని, అత్యవసరమై బయటకు రావాలంటే

పుస్తక ప్రచారమా? సానుభూతి రాజకీయమా? సోనియా తాజా వ్యాఖ్యలపై భిన్న వాదనలు!



దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్యపై సోనియా గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన కుమారుడు రాహుల్, కుమార్తె ప్రియాంకతో జరిగిన చిట్‌చాట్‌లో రాజీవ్ భద్రతను ఉద్దేశపూర్వకంగానే తొలగించారని ఆరోపించారు. ఆయన హత్యకు ముందే కుట్ర జరిగిందని అనుమానం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ సైతం తండ్రి భద్రత ఉపసంహరణ వెనుక ఉద్దేశం ఉందని వ్యాఖ్యానించడంతో రాజకీయంగా చర్చ మొదలైంది.

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ వ్యాఖ్యలు జాతీయ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీని హతమార్చాలనే కుట్రపై సోనియా చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. మాజీ ప్రధాని రాజీవ్ హత్య జరిగి మూడున్నర దశాబ్దాల తర్వాత సోనియా గాంధీ వ్యక్తం చేసిన అనుమానాలు తీవ్ర సంచలన చర్చకు దారితీశాయని అంటున్నారు. సోనియా ఆత్మకథ 'బిలాంగింగ్ : ఎ జర్నీ ఆఫ్ లవ్'లో రాజీవ్ మరణంపై తనకు ఉన్న అనుమానాలను ఎక్కడా నేరుగా ప్రస్తావించలేదని అంటున్నారు. కానీ, ఆ పుస్తక విశేషాలపై కుమారుడు రాహుల్ గాంధీ, కుమార్తె ప్రియాంక గాంధీతో నిర్వహించిన చిట్ చాట్ లో రాజీవ్ హత్యకు ముందు కుట్ర జరిగిందని సోనియా చెప్పడం, దానిపై రాహుల్ గాంధీ ప్రతిస్పందించిన తీరు రాజకీయ వర్గాల్లో పెను ప్రకంపనలు రేపుతున్నాయి.

ఈ ప్రత్యేక సంభాషణలో రాజీవ్ గాంధీ ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో చేసిన పర్యటనల గురించి సోనియా గుర్తుచేసుకున్నారు. ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రాజీవ్ ఓపెన్ జీపులో ప్రయాణిస్తున్నప్పుడు రాళ్ల దాడి, నిరసనలు ఎదురయ్యాయని, బిహార్ పర్యటన తన ఆందోళనను పతాక స్థాయికి చేర్చిందని ఆమె వివరించారు. ఆ సమయంలో సంబంధిత అధికారులు ఆయన భద్రతపై ఏమాత్రం శ్రద్ధ చూపలేదని సోనియా ఆరోపించారు. రాజీవ్ భద్రతను తొలగించడం అనేది కేవలం అనుకోకుండా జరిగిన సంఘటన కాదని, ఆయనను హత్య చేయాలనే ఉద్దేశంతోనే కావాలని భద్రతను ఉపసంహరించారని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. అప్పట్లో ఆ పర్యటనలో తండ్రి వెంట ఉన్న రాహుల్ గాంధీ, అక్కడి పరిస్థితులను చూసి ఇంటికి తిరిగి వచ్చాక "అమ్మా, నాన్న భద్రత విషయంలో మనం ఏదో ఒకటి చేయకపోతే, అతి త్వరలోనే నేను ఆయన అంత్యక్రియలకు తిరిగి రావాల్సి వస్తుందని నాకు తెలుసు" అని ఆవేదన వ్యక్తం చేశారని సోనియా వెల్లడించారు. 500 పేజీలకు పైగా ఉన్న ఈ పుస్తకంలోనూ అమ్మ ఇంకా కొన్ని విషయాలను రాయకుండా వదిలేశారని, నాన్న భద్రతను ఉపసంహరించుకోవడం వెనుక ఒక ఉద్దేశం ఉందని రాహుల్ గాంధీ సైతం ఎక్స్ వేదికగా వ్యాఖ్యానించడం ఈ వివాదాన్ని మరింత తీవ్రతరం చేసింది. అయితే, మూడున్నర దశాబ్దాల తర్వాత సోనియా గాంధీ ఈ స్థాయిలో ఆరోపణలు చేయడంపై జాతీయ రాజకీయాల్లో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. కేవలం పుస్తక ప్రచారం కోసమో లేక రాజకీయంగా సానుభూతి కూడగట్టే ఉద్దేశంతోనో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారా అనే చర్చ ఒకవైపు జోరుగా సాగుతోంది. మరోవైపు, రాజీవ్ గాంధీని హతమార్చాలనే ఉద్దేశంతోనే భద్రతను తొలగించారనేదానికి సోనియా వద్ద ఏమైనా నిర్దిష్టమైన ఆధారాలు ఉన్నాయా అనే ప్రశ్న కూడా తలెత్తుతోంది. ఒకవేళ ఆమె వద్ద బలమైన ఆధారాలు ఉంటే, హత్య జరిగిన తర్వాత ఇన్నాళ్లు, ముఖ్యంగా కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం పదేళ్ల పాటు అధికారంలో ఉన్న సమయంలోనైనా ఈ విషయమై ఎందుకు బహిరంగంగా మాట్లాడలేదని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.

అప్పట్లో జరిగిన విచారణ కమిషన్ల నివేదికలు, ఎస్పీజీ భద్రత ఉపసంహరణ చుట్టూ నడిచిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఇప్పుడు ఈ అంశాన్ని తెరపైకి తేవడం వెనుక ఉన్న ఆంతర్యంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సోనియా వ్యాఖ్యల ఫలితంగా కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా లాభం జరుగుతుందా లేక నష్టం వాటిల్లుతుందా అనే విశ్లేషణలు కూడా ముమ్మరంగా సాగుతున్నాయి. గాంధీ కుటుంబం దేశం కోసం చేసిన త్యాగాలను, ఎదుర్కొన్న విషాదాలను మళ్లీ గుర్తుచేయడం ద్వారా పార్టీ కార్యకర్తల్లో భావోద్వేగ బంధం బలపడి, శ్రేణుల్లో కొత్త ఉత్సాహం వస్తుందని కాంగ్రెస్ వర్గాలు ఆశిస్తున్నాయి.కానీ, వర్తమాన రాజకీయాల్లో ప్రజా సమస్యలు, ఆర్థిక అంశాలపై పోరాడాల్సిన సమయంలో 35 ఏళ్ల క్రితం నాటి ఘటనను లేవనెత్తడం వల్ల ప్రత్యర్థి పార్టీలకు విమర్శించే అవకాశం ఇచ్చినట్లవుతుందని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. పైగా, అప్పట్లో భద్రత ఉపసంహరించిన ప్రభుత్వాలకు మద్దతు ఇచ్చిన పార్టీలు, నాటి రాజకీయ సమీకరణాలపై మళ్లీ చర్చ మొదలైతే అది కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందికరంగా మారే ప్రమాదమూ లేకపోలేదని భావిస్తున్నారు. మొత్తానికి, ఒక ఆత్మకథ ఆవిష్కరణ నేపథ్యంలో మొదలైన కుటుంబ సంభాషణ, ఇప్పుడు దేశ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపిందని అంటున్నారు.

పిల్లలకు వాయిదా రోగం... పేరెంట్స్ ఇలా ఫాలో అవ్వండి..

ఇక జన్మలో వాయిదా వేయరు..



కొంతమంది పిల్లలు ఏ పని కూడా సీరియస్ గా తీసుకోరు. టైంలోగా పూర్తి చేయరు. వాళ్లు అలా చేయడానికి కారణం.. మోటివేట్ చేసేవాళ్లు లేకపోవడం, సెల్ఫ్ డిసిప్లీన్, టైం మేనేజ్?మెంట్ స్కిల్స్ లేకపోవడం, బోర్ ఫీలవ్వడం. ఇలా అనేక రకాల కారణాలవల్ల పిల్లలు చేయాల్సిన పనిని వాయిదా?వేస్తుంటారు. అలా వేయకుండా ఉండాలంటే పేరెంట్స్? తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలుసుకుందాం.
చెప్పిన పని ఎందుకు చేయడం లేదు?' అని పిల్లల్ని అడగాలి. దానికి పిల్లలు ఏం చెబుతారో విని, సమస్య ఎక్కడ ఉందో తెలుసుకోవాలి. ఆ సమస్యకి సొల్యూషన్ చెప్పాలి. టైంకి పనులు చేయడం ఎంత ముఖ్యమో వివరంగా చెప్పాలి.
ఏ విషయమైనా పిల్లలు పేరెంట్స్? ను చూసి నేర్చుకుంటారు. కాబట్టి తల్లిదండ్రులు టైంకి పనులు చేస్తూ, వాళ్లకి ఇన్స్పిరేషన్ గా ఉండాలి.
మొదట్లో పిల్లలు చేయగలిగే పనులు చెప్పాలి. కష్టమైన పనులు చెబితే, వాళ్లు తమ వల్ల కాదని డీలా పడతారు. ఒక్కోసారి పనిచేసే ప్రయత్నం కూడా చేయరు.
ఇంటిపనుల్లో పిల్లల్ని సాయపడమనడం కొంత వరకు మంచిదే. అలాగని వాళ్లని అదేపనిగా ఒత్తిడి చేయకూడదు.
అలాగే, పిల్లలు ఏ చిన్న పని చేసినా కూడా మెచ్చుకోవాలి. దాంతో, వాళ్లకి ఏ పని అయినా చేయగలమనే కాన్ఫిడెన్స్ వస్తుంది.
పిల్లల పనిలో సహాయం అవసరమైతే, వారికి సహాయం అందించండి.
పిల్లల పట్ల సానుకూల దృక్పథాన్ని కలిగి ఉండి... వారు ఆ పనిని పూర్తి చేయగలరని నమ్మకం కలిగించండి
పిల్లలు పని చేయడానికి ప్రశాంతమైన ... కాన్సన్? ట్రేషన్? కలిగే వాతావరణం ఉండేలా చూడాలి.
పిల్లలతో మాట్లాడి వారు పనిని వాయిదా వేయడానికి గల కారణాలను తెలుసుకోండి. పిల్లలు పనిని వాయిదా వేస్తున్నట్లయితే, దాన్ని సరిచేయాల్సిందే.. పిల్లలు పనిని వాయిదా వేయడానికి గల కారణాలను అర్థం చేసుకోవడం మరియు దానిని పరిష్కరించడానికి కలిసి పనిచేయడం చాలా ముఖ్యం.. లేకపోతే వారి జీవితంపై వర్క్? వాయిదా ప్రభావం పడే అవకాశం ఉంది.

ఇంటి చిట్కాలు : దోమలు, ఈగల గోల భరించలేకపోతున్నారా..

వంటింటి చిట్కాలతో ఇలా తరిమికొట్టండి..!



దోమలు, ఈగలు చూడటానికి చిన్నవే అయినా వాటివల్ల వచ్చే ఇబ్బందులు మాత్రం అన్నీఇన్నీ కావు. ఎక్కడెక్కడో తిరిగొచ్చి అన్నం, కూరలపై వాలుతుంటాయ్?. ఈగలు.. గుయ్యి గుయ్యి మంటూ చెవిలో మోత మోగిస్తూ చిరాకుపెడుతుంటాయ్?.వానాకాలం ఏ మాత్రం ఏమరపాటుగా వా ఉన్నా డెంగీ, మలేరియా లాంటి జ్వరాలు చుట్టుముడతాయి. రకరకాల ఇన్ఫెక్షన్లు కూడా వస్తాయి. వీటి బారి నుంచి తప్పించుకోవాలంటే ఇంట్లోంచి దోమలు, ఈగల్ని వెళ్లగొట్టాలి.రసాయన ఉత్పత్తులకు చెక్? పెట్టి ఈగల్ని, దోమల్ని, ఇతర క్రిమికీటకాల్ని ఇంటి నుంచి పారదోలొచ్చు. అదెలాగంటే..
ఈగలు.. దోమలు.. గోల అంతా ఇంతా కాదు.. దోమకాటు ఒళ్లంతా సూది గుచ్చినట్టు ఉంటుంది. అవి తెచ్చిపెట్టే జబ్బులు, జ్వరాలు. వీటి బారినుంచి బయటపడటానికి ఎన్ని రకాల జెట్ కాయిల్స్, లిక్విడ్స్ వాడితే ఇంకో బాధ. వాటి తయారీలో వాడిన రసాయనాల వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయి.
నిమ్మకాయ చెక్కల్లో లవంగాలు గుచ్చి దోమలు, ఈగలు తిరిగే చోట ఉంచాలిబంతిపూలలోని రెపెల్లెంట్ గుణాలు కూడా దోమలను తరిమేస్తాయి.తులసి, పుదీనా, లావెండర్ మొక్కల్ని పెంచితే ఈగలు ఇంటి దరిదాపుల్లో కనపడవు..తులసి, లవంగం రసాల్ని నీళ్లలో కలిపి ఇంట్లో స్ప్రే చేస్తే దోమలు రావు.ఒక కప్పు నీళ్లలో కొంచెం పుదీనా రసం వేసి స్ప్రే చేసినా... ఫలితం ఉంటుంది.ఈగలు ఎక్కువగా ఉన్నచోట కర్పూరం వెలిగించాలి.
నీళ్లలో ఒక స్పూన్ పసుపు కలిపి ఇల్లు శుభ్రం చేస్తే ఈగలు, దోమలు రావు

లోన్ కాదు, ఈఎంఐ లేదు.. క్రెడిట్ కార్డులతోనే

రూ. 85 లక్షల కారు కొన్నాడు!

క్రెడిట్ కార్డులతో రూ. 85 లక్షల బీఎండబ్ల్యూ కారు కొనుగోలు

రెండు కార్డుల ద్వారా పూర్తి మొత్తం చెల్లింపు.. సోషల్ మీడియాలో వెల్లడి

భారీ క్రెడిట్ లిమిట్, బ్యాంకులో కోట్ల ఆస్తి ఉన్న సంపన్నుడి కథ

కొనుగోలుపై డీలర్‌కు రూ. 85 వేల ఫీజు చెల్లింపు

క్రెడిట్ కార్డుల వాడకంపై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు



సాధారణంగా కారు కొనాలంటే లోన్ తీసుకుంటాం, నెలనెలా ఈఎంఐలు కడుతూ ఉంటాం. కానీ, ఓ వ్యక్తి ఈ పద్ధతినే పక్కనపెట్టి, ఏకంగా రూ. 85 లక్షల విలువైన బీఎండబ్ల్యూ కారును రెండు క్రెడిట్ కార్డులతో కొని అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఈ అసాధారణ కొనుగోలుకు సంబంధించిన తన అనుభవాన్ని అతడు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'రెడిట్'లో పంచుకోవడంతో అది క్షణాల్లో వైరల్ అయింది.

రెండు కార్డులతో భారీ చెల్లింపు

ఆ వ్యక్తి తెలిపిన వివరాల ప్రకారం.. కారు ధరలో 60 శాతమైన రూ. 51 లక్షలను ఐసీఐసీఐ క్రెడిట్ కార్డుతో, మిగిలిన 40 శాతం అంటే రూ. 34 లక్షలను అమెరికన్ ఎక్స్‌ప్రెస్ కార్డుతో చెల్లించాడు. అయితే, ఈ లావాదేవీ అనుకున్నంత సులభంగా జరగలేదు. తన చార్టర్డ్ అకౌంటెంట్ ద్వారా బ్యాంకుకు ముందే సమాచారం ఇచ్చినా, రూ. 51 లక్షల చెల్లింపు మొదట తిరస్కరణకు గురైంది. ఆ తర్వాత బ్యాంకు అధికారులు ఫోన్ చేసి నిర్ధారించుకున్నాక లావాదేవీని ఆమోదించారు. ఈ ప్రక్రియలో కాస్త చికాకు ఎదురైందని అతడు పేర్కొన్నాడు.

అసలు ఇది ఎలా సాధ్యమైంది?

క్రెడిట్ కార్డుతో ఇంత పెద్ద మొత్తం ఎలా చెల్లించగలిగాడని చాలామందికి సందేహం రావచ్చు. దీనికి సమాధానం అతడి ఆర్థిక నేపథ్యమే. తన క్రెడిట్ లిమిట్ సుమారు రూ. 50 లక్షలు ఉంటుందని, బ్యాంకులో తన టోటల్ రిలేషన్‌షిప్ వ్యాల్యూ (టీఆర్‌వీ) కోట్లలో ఉందని అతడే స్వయంగా అంగీకరించాడు. అంటే.. ఇది సాధారణ మధ్యతరగతి వ్యక్తి చేసిన సాహసం కాదు, ఓ సంపన్నుడు తన ఆర్థిక స్తోమతకు తగ్గట్టుగా చేసిన కొనుగోలు.

ఫీజులు, రివార్డులపై చర్చ

ఈ డీల్‌లో మరో ఆసక్తికరమైన విషయం ఉంది. క్రెడిట్ కార్డు చెల్లింపుపై కారు డీలర్ 1 శాతం ఫీజు, అంటే రూ. 85,000 వసూలు చేశాడు. ఇంత పెద్ద మొత్తంపై వచ్చే రివార్డు పాయింట్లు, ఇతర ప్రయోజనాల విలువ ఈ ఫీజు కంటే ఎక్కువా? తక్కువా? అనే దానిపై నెటిజన్లు చర్చిస్తున్నారు.
ఈ సంఘటన సోషల్ మీడియాలో పెద్ద చర్చకే దారితీసింది. క్రెడిట్ కార్డు అనేది అప్పు కార్డు కాదని, తెలివిగా వాడితే అదో ఆర్థిక ఆయుధమని కొందరు అంటుంటే, ఇలాంటివి చూసి అనుకరించవద్దని, అప్పుల ఊబిలో కూరుకుపోతామని మరికొందరు హెచ్చరిస్తున్నారు. అంతిమంగా, క్రెడిట్ లిమిట్ ఎంత ఉన్నా, తిరిగి చెల్లించగల సామర్థ్యాన్ని బట్టే ఖర్చు చేయాలన్నదే ఈ కథనం చెప్పే నీతి.



వరద నీటిలో నడుస్తున్నారా?

మురుగుతో కలిసిన వరద నీటిలో నడిస్తే పాదాలు, కాళ్లకు ఇన్ఫెక్షన్లు తలెత్తొచ్చు. ముఖ్యంగా చర్మం కింది పొర వాపు (సెల్యులైటిస్) పెద్ద చిక్కే తెచ్చిపెడుతుంది. ఇది ప్రధానంగా స్టెఫలోకాకస్, స్ట్రెప్టోకాకస్ బ్యాక్టీరియాతో వస్తుంది. ఇవి చర్మం గీసుకుపోయిన చోటు నుంచి తేలికగా లోపలికి వెళ్లి, ఇన్ఫెక్షన్‌కు దారితీస్తాయి. ఈ సమస్య కాళ్లు, పాదాలు, వేళ్లలో ఎక్కువ. చాలావరకూ చర్మం దిగువ, కొవ్వు పొరలకే పరిమితమవుతుంది. సెల్యులైటిస్‌లో ఇన్ఫెక్షన్ తలెత్తిన చోట చర్మం ఎరుపెక్కుతుంది. కాలు వాపు, ఉబ్బు, తీవ్రమైన నొప్పి, బొబ్బల వంటివీ కనిపిస్తాయి. చూడటానికి చర్మం చిన్న గుంతలు పడినట్టుగా నారింజ తొక్కలా కనిపిస్తుంది. కొందరికి జ్వరం, చలి, బలహీనత కూడా తలెత్తొచ్చు. దీనికి యాంటీబయాటిక్ మాత్రలు అంతగా పనిచేయవు. రక్తనాళం ద్వారా 7-10 రోజులు యాంటీబయాటిక్స్ ఇవ్వాల్సి ఉంటుంది. నిర్లక్ష్యం చేస్తే సమస్య ముదిరి, ఇన్ఫెక్షన్ రక్తంలోకి వ్యాపించే ప్రమాదమూ ఉంది.

నివారణ ఉత్తమం

వర్షపు నీటిలో తడిచినప్పుడు ఇంటికి వచ్చాక వెచ్చటి నీటితో శుభ్రంగా పాదాలు కడుక్కోవాలి. గాట్లు ఉన్నట్టయితే యాంటీబయాటిక్ మలాము రాసుకోవాలి. ఒకవేళ ఒళ్లంతా తడిస్తే వేడి నీటితో స్నానం చేయాలి.

పాదాలు పొడిగా ఉండేలా, గాలి తగిలేలా చూసుకోవాలి. వర్షాకాలంలో బయటకు వెళ్లేటప్పుడు నీటికి తడవని షూ వేసుకుంటే మేలు. పూర్తిగా ఆరిన తర్వాతే చెప్పులు, షూ తిరిగి ధరించాలి. చెప్పులు వేసుకోకుండా ఆరుబయట, వాననీటిలో నడవొద్దు.

మధుమేహం వంటి సమస్యలుంటే డాక్టర్ సలహా మేరకు ప్రత్యేక చెప్పులు, షూ వేసుకోవాలి. తరచూ పాదాలు, కాళ్లను గమనించాలి. ఎరుపు, వాపు వంటి లక్షణాలేవైనా ఉన్నాయేమో చూసుకోవాలి. ఇతరుల పాదరక్షలను వేసుకోవద్దు.

సంపాదకీయం

కూటముల కాలం!

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఇంత అశాంతిగా ప్రపంచం ఎప్పుడూ లేదు. ఊహించని చోట్ల యుద్ధాలతో ప్రపంచం ముక్కలవుతోంది, ఇంధన సంక్షోభం ప్రతి దేశాన్నీ తాకుతోంది. సరఫరా వ్యవస్థలు దెబ్బతిన్నాయి. వీటన్నింటిలో పెద్దది ఇరాన్ యుద్ధం. ఫిబ్రవరి 28న మొదలైన యుద్ధం.. ఇప్పుడు ఎనిమిదో నెలలో ఉంది. సుదీర్ఘ యుద్ధంలో స్పష్టమైన విజేత కనిపించడం లేదు. త్వరగా రాజకీయ మార్పు తీసుకురావాలన్న ప్రణాళిక ఫలించలేదు. బలప్రయోగానికి ఉన్న పరిమితులు బయటపడ్డాయి, ఆర్థిక అభద్రత పెరిగింది, ప్రజలు అనవసరంగా బాధలు పడుతున్నారు. ఇలాంటి అనిశ్చితిలో దేశాలు తమ భద్రతకు కొత్త భాగస్వాములను వెతుక్కుంటున్నాయి. అందులో ముఖ్యమైనది మక్కా ఒప్పందం. 2026 ఆగస్టు 7న సౌదీ అరేబియా, టర్కీ, పాకిస్తాన్ పవిత్ర నగరం మక్కాలో త్రైపాక్షిక పరస్పర రక్షణ ఒప్పందం చేసుకున్నాయి. ఏ ఒక్క దేశంపై జరిగిన సాయుధ దాడినైనా మూడింటిపై దాడిగా పరిగణిస్తామని అందులో ఉంది. దీనికి ముందు 2025 సెప్టెంబరులో సౌదీ, పాకిస్తాన్ ఇదే తరహా పరస్పర రక్షణ ఒప్పందం చేసుకున్నాయి. దోహాపై ఇజ్రాయెల్ దాడి చేసిన కొద్దిరోజులకే అది జరిగింది. కొత్త ఒప్పందంలో ముగ్గురి బలాలు ఒకదానికొకటి పూరకంగా ఉన్నాయి. టర్కీ రక్షణ పరిశ్రమ, సైనిక అనుభవం; సౌదీ ఆర్థిక బలం, భౌగోళిక స్థానం; పాకిస్తాన్ అణు నిరోధక శక్తి. అందుకే కొందరు విశ్లేషకులు దీన్ని మధ్యప్రాచ్యంలో మూడో "శక్తి కేంద్రం"గా, అమెరికా వైదొలగే పరిస్థితికి "బీమా"గా అభివర్ణిస్తున్నారు. అయితే ఇది సైనిక కూటమి కాదని సౌదీ అరేబియా ప్రత్యేకంగా ప్రకటించింది. అణు అంశాలతోనూ దీనికి సంబంధం లేదని చెప్పింది. టర్కీ, పాకిస్తాన్ పెద్దఎత్తున సైన్యాన్ని సౌదీకి పంపే అవకాశం లేదని విశ్లేషకులు అంటున్నారు. పైగా పూర్తి ఒప్పంద పాఠాన్ని ఇంకా ప్రజల ముందు ఉంచలేదు, పదకొండు నెలల క్రితం నాటి సౌదీ-పాక్ ఒప్పందంలోని నిబంధనలు కూడా ఇప్పటికీ రహస్యమే. అందువల్ల ఇది కాగితంపై ఉన్నంత బలంగా నేలమీద ఉంటుందా అనే ప్రశ్న మిగిలే ఉంది.

రెండో పరిణామం బదర్ ఒప్పందం (ఎంఓయూ). దీని ప్రభావం ఇంకా పూర్తిగా విశ్లేషణలోకి రాలేదు, కానీ ఇది కూడా చిన్నదేమీ కాదు. 2026 అక్టోబర్ 21న దోహాలో పాకిస్తాన్, టర్కీ, ఖతార్, ఇండోనేషియా బహుపాక్షిక రక్షణ సహకార ఒప్పందంపై సంతకాలు చేశాయి. రక్షణ ఉత్పత్తి, సాంకేతిక శిక్షణ, పరిశోధనలో సహకారం దీని లక్ష్యం. మక్కా ఒప్పందంలా ఇది "ఒకరిపై దాడి అందరిపై దాడి" అనే రక్షణ హామీ కాదు, ఇది రక్షణ పరిశ్రమల భాగస్వామ్యం. ఆయుధాల కోసం పాశ్చాత్య దేశాలపై ఆధారపడటాన్ని, దానితో వచ్చే రాజకీయ షరతులను తగ్గించుకునే ప్రయత్నమే దీని వెనుక ఉందని పరిశీలకులు చెబుతున్నారు. ఎవరెవరు ఏం ఇస్తారో చూస్తే చిత్రం స్పష్టమవుతుంది. టర్కీ సాంకేతికత, డ్రోన్లు, వాహనాలు, నాటో అనుభవాన్ని ఇస్తుంది. పాకిస్తాన్, ఇండోనేషియా ఉత్పత్తి సామర్థ్యాన్ని, సాంకేతిక సిబ్బందిని అందిస్తాయి. ఖతార్ పెట్టుబడులు పెడుతుంది. టర్కీ యుద్ధనౌకల ప్రాజెక్టు పాకిస్తాన్‌తో, రక్షణ పరిశ్రమ సంబంధాలు ఖతార్, ఇండోనేషియాతో ఇప్పటికే ఉన్నాయి. ఇవన్నీ ఇప్పుడు ఒకే చట్రంలోకి వచ్చాయి.

ఆర్థికంగా బలహీనంగా ఉన్న పాకిస్తాన్‌కు ఇది పెద్ద వరమే. నిధులు, ఆధునిక సాంకేతికత, ఆయుధాలు పొందే దారులు దానికి ఇప్పుడు ఎక్కువయ్యాయి. పైగా పాకిస్తాన్ దౌత్య ప్రతిష్ఠ కూడా పెరిగింది. ఇరాన్‌తో కాల్పుల విరమణకు అమెరికా ఒప్పుకోవడం పాకిస్తాన్‌పై అభిమానంతోనే అని ట్రంప్ అన్నారు. అమెరికా-ఇరాన్ మధ్య చర్చల్లో సంధానకర్తగా నిలబడిన దేశం, ఇప్పుడు గల్ఫ్ సంపదతో, టర్కీ సాంకేతికతతో జతకట్టింది. ఈ బలాన్ని అది భారత్‌కు వ్యతిరేకంగా ఎలా ఉపయోగిస్తుందన్నదే మన ఆందోళన. ఇందులో పొంచి ఉన్న మరో సూక్ష్మమైన ప్రమాదం కూడా ఉంది. మనం ఇండోనేషియాకు బ్రహ్మోస్ వంటి క్షిపణులను ఎగుమతి చేస్తున్నాం. ఆ దేశం బదర్ భాగస్వామి కావడంతో, మన రహస్య సాంకేతిక సమాచారం ఈ కూటమిలోని ఇతర సభ్యులకు చేరకుండా చూసుకోవడం బాధ్యత.

మరి భారత్ ఏం చేయాలి? ముందుగా, ఆందోళన పడటం ఎంత తప్పో, పట్టించుకోకపోవడం కూడా అంతే తప్పు. ఈ ఒప్పందం జాతీయ భద్రతపై, ప్రాంతీయ శాంతిపై చూపే ప్రభావాలను పరిశీలిస్తున్నామని విదేశాంగ శాఖ ఆగస్టు 11న చెప్పింది. జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని కూడా స్పష్టం చేసింది. ఇక్కడ మనకు ఆందోళన కలిగించే అంశం ఒప్పంద పాఠంలోని పదాలు కాదు, నేతల మాటలు. పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇజ్రాయెల్‌తో పాటు భారత్ పేరును కూడా లక్ష్యంగా ప్రస్తావించారు. పైకి భారత వ్యతిరేక ఎజెండా లేకపోయినా, పాకిస్తాన్ తన ఎజెండాను ఈ వేదికల ద్వారా ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తుందని అనుకోవాలి. అదే సమయంలో అతిగా స్పందించడం కూడా మంచిది కాదు. ఇది ప్రస్తుతానికి రాజకీయ భద్రతా అనుసంధానమే తప్ప పూర్తి సైనిక కూటమి కాదని, వివరాలు తెలిసేవరకు తొందరపడి నిర్ణయాలకు రావద్దని మాజీ రాయబారులు, విశ్లేషకులు సూచించారు. పాకిస్తాన్ మొదటి నుంచీ సీటో, సెంటో, బాగ్దాద్ ఒప్పందం వంటి సైనిక కూటముల్లో చేరుతూ వచ్చిన దేశం. భారత్ మార్గం వేరు. మన విదేశాంగ విధానానికి పునాది వ్యూహాత్మక స్వతంత్రత. నెహ్రూ కాలం నాటి అలీనవిధానం ఇప్పుడు బహుముఖ భాగస్వామ్య విధానంగా కొనసాగుతోంది, అదే మనకు సరైన బాట. కాబట్టి ఇప్పుడు కొన్ని పనులు తప్పనిసరి. మొదటిది, మక్కా ఒప్పందం కాగితాల్లోనే ఉంటుందా లేక ఆచరణలో సైనిక ఏర్పాటుగా మారుతుందా అన్నది నిశితంగా గమనించడం. కొత్త దేశాలు కూడా చేరవచ్చనే ఊహాగానాలు ఉన్నాయి. రెండోది, రక్షణ సాంకేతికత విషయంలో గట్టి రక్షణ గోడలు కట్టుకోవడం. మూడోది, చమురు సరఫరాకు, హార్మూజ్ వంటి సముద్ర మార్గాల్లో మన వాణిజ్య నౌకల స్వేచ్ఛా ప్రయాణానికి కీలకమైన సౌదీ, ఖతార్ వంటి గల్ఫ్ దేశాలతో, ఇరాన్‌తో ప్రత్యక్ష సంబంధాలను మరింత బలపరచుకోవడం. నాలుగోది, రక్షణ ఉత్పత్తుల్లో స్వయంసమృద్ధిని వేగంగా సాధించడం, ఎందుకంటే సొంత బలమే అసలైన కవచం. మధ్యప్రాచ్యం తన భద్రతా వ్యవస్థను తానే రూపొందించుకుంటోంది, ఇందులో అమెరికా ప్రభావం తగ్గుతున్నట్టు కనిపిస్తోంది. ఈ మార్పులో భారత్ ప్రేక్షకుడిగా ఉండకూడదు. ఎవరికీ బందీ కాకుండా, అందరితో మాట్లాడగలిగే, అందరికీ అవసరమయ్యే శక్తిగా ఎదగడమే మన దౌత్యం ముందున్న అసలు పరీక్ష!

పనికొచ్చే పలుకు



ధైర్యం చూపితే.. మీరూ రోజర్ బానిస్టరే!

భయం.. ఇది కేవలం మన మనసు సృష్టించుకున్న ఒక భ్రమ మాత్రమే. మనలోని అసలైన శక్తిసామర్థ్యాలను బయటకు రాకుండా అడ్డుకునేది అదే. అందుకే భయాన్ని వదిలి జీవితంలో ముందుకు సాగండి. ఒకప్పుడు ప్రపంచమంతా ఒక విషయం నమ్మేది. "మనిషి నాలుగు నిమిషాల్లో ఒక మైలు దూరం పరిగెత్తడం అసాధ్యం. అలా పరిగెడితే శరీరం తట్టుకోలేదు" అని డాక్టర్లు, నిపుణులు చెప్పేవారు. ఎన్నో ఏళ్లు ఎందరో పరుగువీరులు ప్రయత్నించారు, కానీ ఎవరూ ఆ హద్దును దాటలేకపోయారు. చివరికి ఆ నమ్మకం అందరి మనసుల్లో గట్టిగా కూర్చుంది.

1954లో రోజర్ బానిస్టర్ అనే యువకుడు ఆ నమ్మకాన్ని నమ్మలేదు. అతను పరిగెత్తి, మూడు నిమిషాల 59 సెకన్లలో మైలు పూర్తి చేశాడు. అసలు ఆశ్చర్యం ఆ తర్వాత జరిగింది. అతని రికార్డు తర్వాత కొన్ని వారాల్లోనే ఇంకొకరు అదే ఘనత సాధించారు. ఆ తర్వాత కొనేళ్లలోనే ఎంతోమంది సాధించారు. అంటే వారి కాళ్లలో కొత్తబలం రాలేదు. "ఇది సాధ్యమే" అని తెలిసిన తర్వాత వారి మనసులో భయం పోయింది, అంతే.

దీని నుంచి మనం నేర్చుకోవాల్సింది ఒకటే. చాలాసార్లు మనల్ని ఆపేది మన శక్తి లేకపోవడం కాదు, మన మనసులో ఉన్న భయం. భయం ఎప్పుడూ ఇంకా జరగని విషయం గురించే ఉంటుంది. "ఫెయిల్ అయితే ఏంటి? నలుగురూ ఏమనుకుంటారు?" అనే ఊహలే మనల్ని వెనక్కి లాగుతాయి. అంటే మనం భయపడేది నిజానికి కాదు, మన ఊహకు.

భయాన్ని జయించడానికి కొన్ని చిన్న మార్గాలు:

చిన్నగా మొదలుపెట్టండి. ఒకేసారి పెద్ద అడుగు వేయాల్సిన అవసరం లేదు. రోజుకు ఒక చిన్న ధైర్యమైన పని చేయండి. కొత్త వ్యక్తితో మాట్లాడటం, ఒక సందేహం అడగడం లాంటివి. ఈ చిన్న గెలుపులే పెద్ద ధైర్యానికి పునాది.

చెత్తగా ఏం జరగవచ్చో ఆలోచించండి. చాలాసార్లు ఆ "చెత్త" కూడా మనం తట్టుకోగలిగేదే అని అర్థమవుతుంది. అప్పుడు భయం సగం తగ్గిపోతుంది.

ఓటమిని పాఠంగా చూడండి. పడిపోవడం తప్పు కాదు. పడినచోటే ఉండిపోవడం తప్పు.

మీ "నాలుగు నిమిషాల గోడ" ఏదో గుర్తించండి. "ఇది నా వల్ల కాదు" అని మీరు అనుకుంటున్న విషయం నిజంగా అసాధ్యమా? లేక ఎవరో చెప్పిన మాట మీరు నమ్ముతున్నారా? అని ప్రశ్నించుకోండి.

ధైర్యం అంటే భయం లేకపోవడం కాదు. భయం ఉన్నా అడుగు ముందుకు వేయడమే ధైర్యం. మొదటి అడుగు వేసిన క్షణమే భయం చిన్నదవుతుంది, ఆత్మవిశ్వాసం పెద్దదవుతుంది.

ఈ రోజే ఒక అడుగు వేయండి. మీ ముందున్న గోడ మీరు అనుకున్నంత ఎత్తైనది కాకపోవచ్చు!

డేటా యుద్ధానికి సిద్ధమా!?



2015 డిసెంబరులో ఉక్రెయిన్‌లో కొన్ని లక్షల మంది ఇళ్లు ఒక్కసారిగా చీకటిలో మునిగిపోయాయి. ఎక్కడా బాంబు పేలలేదు. ఒక్క సైనికుడూ సరిహద్దు దాటలేదు. విద్యుత్ సరఫరా వ్యవస్థల్లోకి చొరబడిన సైబర్ దాడే ఆ అంధకారానికి కారణం. అంతకు ఎనిమిదేళ్ల ముందే, 2007లో ఎస్టోనియా దేశం బ్యాంకులు, ప్రభుత్వ వెబ్‌సైట్లు, మీడియా సంస్థలు వారాల తరబడి స్తంభించిపోయే సైబర్ దాడులను ఎదుర్కొంది. ఇరాన్ అణు కేంద్రాల్లో యంత్రాలను లోపలి నుంచే ధ్వంసం చేసిన 'స్టక్స్‌నెట్' వైరస్ కథ కూడా అందరికీ తెలిసిందే. ఈ ఉదాహరణలన్నీ చెప్పేది ఒక్కటే. యుద్ధం ఇకపై తుపాకులు, ట్యాంకులతోనే జరగదు, కంప్యూటర్ తెరల వెనుక, డేటా ప్రవాహాల్లోనూ జరుగుతుంది. నేటి రణరంగంలో అల్గారిథమ్‌లు, కంప్యూటింగ్ శక్తి, డేటాయే అసలైన బలం. సమాచారాన్ని సేకరించడం, దొంగిలించడం, అడ్డుకోవడం, కాపాడుకోవడం, తారుమారు చేయడం.. ఇవన్నీ ఇప్పుడు ఆయుధాలే. సైబర్ దాడులు, డిజిటల్ సమాచార వ్యవస్థలతో అసలు పోరాటమే చేయకుండా శత్రువును దెబ్బతీసే శక్తి డేటాకు ఉంది. రష్యా-ఉక్రెయిన్, ఇరాన్-ఇజ్రాయెల్-అమెరికా సంఘర్షణల్లో ఇదే మళ్లీ మళ్లీ కనిపించింది. మన పొరుగునా పరిస్థితి భిన్నంగా లేదు. 2020లో భారత్-చైనా సరిహద్దు ఉద్రిక్తతల సమయంలో, చైనాతో సంబంధం ఉన్న 'రెడ్‌ఎకో' హ్యాకర్ల బృందం మన విద్యుత్ రంగ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుందని అంతర్జాతీయ సైబర్ భద్రతా సంస్థలు నివేదించాయి. 2025లో భారత్-పాకిస్తాన్ ఘర్షణ సమయంలో కూడా సైబర్ దాడులు, తప్పుడు ప్రచారాలు ఒక్కసారిగా ఊపందుకున్నాయి. అంటే సరిహద్దు మీద సైనికుడు కాపలా కాస్తున్నట్టే, నెట్‌వర్క్ మీద కూడా కాపలా అవసరమైన కాలం వచ్చేసింది.

ఈ ముప్పు ఎక్కడో దూరంలో లేదు, రోజూ మన తలుపు తడుతోంది. నిరుడు భారత్‌కు వ్యతిరేకంగా 29 లక్షలకు పైగా సైబర్ భద్రతా ఘటనలు నమోదయ్యాయి. వీటిలో ర్యాన్సమ్‌వేర్ (డేటాను బంధించి డబ్బు డిమాండ్ చేసే దాడులు), డీడీవోఎస్ దాడులు, మాల్వేర్, వెబ్‌సైట్ల రూపురేఖల తారుమారు, డేటా చౌర్యాలు ఎక్కువయ్యాయి. యూపీఐ చెల్లింపుల నుంచి ఆసుపత్రులు, విద్యుత్ గ్రిడ్లు, బ్యాంకుల వరకు అన్నీ డిజిటల్ అయిన దేశంలో ఇది చిన్న విషయం కాదు. దీన్ని ఎదుర్కోవడానికి మనకు ఒక భద్రతా చట్రం ఉంది. సైబర్ ఘటనలను పర్యవేక్షించి స్పందించే 'ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సెర్ట్-ఇన్)', ముప్పుల సమన్వయానికి 'నేషనల్ సైబర్ కోఆర్డినేషన్ సెంటర్', కీలక సమాచార మౌలిక సదుపాయాల రక్షణకు 'ఎన్‌సీఐఐపీసీ', గూఢచర్యంపై నిఘా సమాచారం పంచుకునే 'సైబర్ మల్టీ-ఏజెన్సీ సెంటర్' అందులో భాగాలు. సైనిక రంగంలో 2019లో ఏర్పడిన 'డిఫెన్స్ సైబర్ ఏజెన్సీ' కూడా ఈ ప్రయత్నంలో కీలకమే. 2022 నుంచి సైబర్ ఘటనలను ఆరు గంటల్లోగా నివేదించాలనే నిబంధన అమలులో ఉంది. నిరుడు విడుదలైన 'జాయింట్ డాక్ట్రిన్ ఫర్ సైబర్‌స్పేస్ ఆపరేషన్స్' దాడి, రక్షణ సామర్థ్యాలను ఏకం చేసే ప్రయత్నమే. అయితే సవాలు చాలా వేగంగా మారుతోంది. అత్యాధునిక కృత్రిమ మేధ (ఏఐ) తనకుతానుగా లోపాలను కనిపెట్టగలదని, ఫిషింగ్ దాడులు చేయగలదని, సమాచారాన్ని సేకరించగలదని సెర్ట్-ఇన్ ఇటీవల హెచ్చరించి, ప్రతిచర్యల పత్రాన్ని కూడా విడుదల చేసింది. భవిష్యత్తులో క్వాంటం కంప్యూటర్లు నేటి ఎన్‌క్రిప్షన్‌ను ఛేదించే ప్రమాదం కూడా ఉంది. అందుకే 'నేషనల్ క్వాంటం మిషన్' ద్వారా సురక్షిత సాంకేతికతలను అభివృద్ధి చేస్తూ, 'క్వాంటం-సేఫ్ ఎకోసిస్టమ్' వ్యూహాన్ని రూపొందిస్తున్నారు. అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, సింగపూర్ సంస్థలతో సహకారం, సైబర్ సిబ్బంది శిక్షణ కోసం బిట్స్ పిలానీతో భాగస్వామ్యం, నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ ద్వారా పరిశోధనల ప్రోత్సాహం కూడా కొనసాగుతున్నాయి. 'రక్షణ దళాల విజన్ 2047' కూడా నమ్మకమైన ఏఐ, స్వదేశీ స్వయంచాలిత దాడి-రక్షణ వ్యవస్థలు, డ్రోన్లు, వాటి నిరోధక సాంకేతికతలను సమకూర్చుకోవాలని నొక్కిచెబుతోంది.

రేపు ఉదయం లేచేసరికి మీ ఫోన్‌లో యూపీఐ పనిచేయకపోతే? ఏటీఎంలు మూగబోతే, ఇంట్లో కరెంటు రాకపోతే, ఆసుపత్రి రికార్డులు మాయమైతే? ఇదంతా ఏ శత్రు సైనికుడూ గడప దాటకుండానే జరిగిపోవచ్చు. అదే 'డేటా యుద్ధం'.. కనిపించని రణరంగం! నిరుడు మన దేశంపై 29 లక్షలకు పైగా సైబర్ దాడులు జరిగాయి. మరి అలాంటి యుద్ధాలను ఎదుర్కోవడానికి భారత్ సిద్ధంగా ఉన్నట్టేనా?

ఇంతకూ ఇప్పుడు మనం ఏం చేయాలి? మొదటిది, ఇతర దేశాల అనుభవాల నుంచి నేర్చుకోవడం. స్వయంచాలిత డ్రోన్ల సమూహాల నిర్వహణలో బ్రిటన్, మానవరహిత వైమానిక వ్యవస్థల్లో దక్షిణ కొరియా, నిఘా వ్యవస్థల్లో అమెరికా సాధించిన పురోగతిలో మనకు పాఠాలున్నాయి. చైనా అనుసరిస్తున్న సైబర్ వ్యూహాలను నిశితంగా గమనిస్తూ ప్రతిచర్యలకు ముందే సిద్ధంగా ఉండాలి. రెండోది, కేవలం కొనుగోళ్లపై ఆధారపడకుండా సొంత ఆవిష్కరణలపై దృష్టి పెట్టడం. 'ఆత్మనిర్భర్ భారత్' నినాదం ఇక్కడే నిజంగా పరీక్షకు నిలుస్తుంది. ఎందుకంటే విదేశీ సాఫ్ట్‌వేర్, పరికరాలపైనే ఆధారపడితే, అవి మన భద్రతకే బలహీనత కావచ్చు. విద్యాసంస్థలు, డీఆర్‌డీవో, రక్షణ పరిశ్రమ, స్టార్టప్‌లు కలిసి పనిచేసేలా భాగస్వామ్యాలను బలోపేతం చేయాలి. మూడోది, మనుషులు. యంత్రాలకన్నా వాటిని నడిపే నిపుణులే కీలకం. ఏఐ నిపుణులు, డేటా సైంటిస్టులు, ఇంజినీర్లతో కూడిన ప్రత్యేక 'డేటా యుద్ధ బలగం' ఏర్పాటుపై ప్రభుత్వం ఆలోచించాలి. డ్రోన్లు, ఉపగ్రహాలు, సెన్సర్లు నిరంతరం డేటా ప్రవాహాన్ని సృష్టిస్తున్న ఈ కాలంలో, 2040 నాటికి పాకిస్తాన్, చైనా సరిహద్దులతో పాటు ఇండో-పసిఫిక్ ప్రాంతంలోనూ డేటా ఆధారిత పోరాటానికి మన వ్యూహం సిద్ధంగా ఉండాలి. అయితే ఇది ప్రభుత్వం, సైన్యం బాధ్యత మాత్రమే కాదు. సైబర్ నేరగాళ్ల దృష్టిలో మన ఫోన్‌లు, పాస్‌వర్డ్‌లు, క్లిక్ చేసే ప్రతి లింకు కూడా దేశ భద్రతా వలయంలో ఒక లంకె. ఆ లంకెల్లో ఒక్కటి బలహీనమైనా మొత్తం గొలుసుకే ప్రమాదం. కాబట్టి డేటా యుద్ధంలో గెలుపు సర్వర్ గదుల్లో మాత్రమే నిర్ణయం కాదు, ప్రతి పౌరుడి జాగ్రత్తలోనూ ఉంది. ఇంటికి తాళం వేయడం ఎంత సహజమో, డిజిటల్ జీవితానికి భద్రత కల్పించుకోవడం కూడా అంతే సహజం కావాలి! ■



వ్యాయామం చేసేటప్పుడు కూడా ముక్కుతోనే గాలి పీల్చాలని కొందరు చెబుతారు. కానీ నోరు మూసుకుని నాలుగంతస్తుల మెట్లు వేగంగా ఎక్కి చూడండి, అసలు విషయం అర్థమవుతుంది. శరీరం ఎక్కువ శ్రమ పడినప్పుడు కండరాలకు ఎక్కువ ఆక్సిజన్ కావాలి, ఎక్కువ గాలి అవసరమవుతుంది. అందుకే మనకు తెలియకుండానే నోరు తెరుచుకుంటుంది. ఇది శరీరం చేసే సహజమైన ఏర్పాటు. కాబట్టి ఇకపై కసరత్తులు చేసేటప్పుడు నియమాల గురించి ఆలోచించకుండా, ముక్కు, నోరు రెండింటితోనూ హాయిగా శ్వాస తీసుకోండి.

-మహాదేవ

వింతల్లో వింతలు

ఆ దొంగ... ఒక కోతి!



అమెరికాలోని మిన్నెసోటా రాష్ట్రం, ఆల్బర్ట్ లీ పట్టణం. శనివారం తెల్లవారుజామున పోలీసులకు ఒక ఫోన్ వచ్చింది: "అనుమానాస్పద వ్యక్తి చెట్టుకు వేలాడుతున్నాడు!" వెళ్లి చూస్తే, చలిలో వణుకుతున్న 'మెక్‌నగెట్' అనే స్పైడర్ మంకీ కనిపించింది. పోలీసులు దాన్ని తమ కారులో ఎక్కించుకున్నారు. "అది లాయర్‌ను, ఒక అరటిపండును అడిగింది, అదే వరుసలో!" అని పోలీసులు సరదాగా పోస్ట్ పెట్టారు. చివరకు ఆ కోతి తన యజమాని చెంతకు చేరింది.

వైభవ్ విశ్వరూపం

52 బంతుల్లో డబుల్ సెంచరీ.. 28 సిక్స్‌లతో సునామీ.. ప్రపంచ రికార్డులన్నీ గల్లంతు!



ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే కనీవినీ ఎరుగని సరికొత్త విధ్వంసం నమోదైంది. భారత టీనేజ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ బంతిని బాదుడే బాదుడు అన్నట్లుగా విరుచుకుపడుతూ పలు అంతర్జాతీయ, దేశవాళీ రికార్డులను తుడిచిపెట్టేశాడు. కేవలం 52 బంతుల్లోనే డబుల్ సెంచరీ (ద్విశతకం) బాది ప్రపంచ వన్డే క్రికెట్‌ను నివ్వెరపరిచాడు. లిస్ట్-ఏ వన్డే చరిత్రలోనే అత్యంత వేగవంతమైన ద్విశతకంగా ఇది చరిత్రకెక్కింది. అంతకుముందు చాడ్ బోవ్స్ 103 బంతుల్లో నెలకొల్పిన ప్రపంచ రికార్డును సూర్యవంశీ సగానికి సగం బంతుల్లోనే బద్దలు కొట్టడం గమనార్హం. గతంలో ఎన్ జగదీశన్ (114 బంతులు), హ్యారీ బ్రూక్ (114 బంతులు) పేరిట ఉన్న రికార్డులన్నీ ఈ సునామీ ధాటికి కొట్టుకుపోయాయి. దోహా వేదికగా యూఏఈతో జరిగిన ఏసీసీ మెన్స్ ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2026 గ్రూప్-బి పోరులో వైభవ్ బ్యాటింగ్‌కు ప్రత్యర్థి బౌలర్లు బెంబేలెత్తిపోయారు. క్రీజులోకి వచ్చిన క్షణం నుంచే సిక్సర్ల వర్షం కురిపించిన సూర్యవంశీ.. ఒకే ఇన్నింగ్స్‌లో ఏకంగా 28 సిక్సర్లు బాది యావత్ ప్రొఫెషనల్ క్రికెట్ చరిత్రలోనే అత్యధిక సిక్సర్ల ఆల్‌టైమ్ వరల్డ్ రికార్డును లిఖించాడు. 2024 రంజీ ట్రోఫీలో హైదరాబాద్ బ్యాటర్ తన్మయ్ అగర్వాల్ కొట్టిన 26 సిక్సర్ల రికార్డును అతడు అధిగమించాడు. న్యూజిలాండ్ విధ్వంసకర బ్యాటర్ కొలిన్ మన్రో (23 సిక్సర్లు), ఆస్ట్రేలియా ప్లేయర్ డార్సీ షార్ట్ (23 సిక్సర్లు) సాధించిన మైలురాళ్లను కూడా వైభవ్ సునాయాసంగా దాటేశాడు.

వైభవ్ ఆడిన ఈ నమ్మశక్యం కాని ఇన్నింగ్స్‌లో మొదట కేవలం 16 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత సునామీలా విరుచుకుపడుతూ 28 బంతుల్లో సెంచరీ కొట్టి లిస్ట్-ఏ క్రికెట్లో ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డు బద్దలు కొట్టాడు. ఆ తర్వాత 40 బంతుల్లో 150 మార్కును అందుకున్నాడు. ఇది కూడా ఓ రికార్డే. అక్కడితో ఏమాత్రం ఆగకుండా అదే జోరు కొనసాగిస్తూ 52 బంతుల్లోనే 200 పరుగుల మార్కును దాటి రికార్డులను తిరగరాశాడు. లిస్ట్-ఏ చరిత్రలో వేగవంతమైన సెంచరీ, ఫాస్టెస్ట్ 150, అత్యంత వేగవంతమైన డబుల్ సెంచరీ.. ఇలా అన్ని రికార్డులనూ ఒకే మ్యాచ్‌లో కొల్లగొట్టిన ఏకైక బ్యాటర్‌గా నిలిచాడు. వైభవ్ ధాటికి ఇండియా-ఏ కేవలం 5 ఓవర్లలోనే 100 పరుగులు పూర్తి చేసుకుని సరికొత్త జట్టు రికార్డును సైతం నమోదు చేసింది.

మ్యాచ్ వన్ సైడెడ్ ఇలా అయింది!

తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న యూఏఈ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. ఆరంభంలోనే హర్షిత్ రాణా, అర్షద్ ఖాన్ చెలరేగడంతో 20 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ యూఏఈని మాజీ భారత దేశవాళీ బ్యాటర్ హర్‌ప్రీత్ సింగ్ భాటియా అద్భుత శతకంతో ఆదుకున్నాడు. హర్‌ప్రీత్ 144 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్సర్లతో 130 పరుగులు సాధించి జట్టుకు భారీ స్కోరు అందించగా.. మహ్మద్ షహదాద్ (28), ఏతాన్ డిసౌజా (25), చివర్లో కెప్టెన్ బాసిల్ హమీద్ (నాటౌట్ 36) అతడికి విలువైన సహకారం అందించారు. భారత బౌలర్లలో అర్షద్ ఖాన్ 10 ఓవర్లలో 43 పరుగులిచ్చి 4 వికెట్లతో సత్తా చాటగా.. హర్షిత్ రాణా, సూర్యాంశ్ షెడ్గే, హర్ష్ దూబే, షాబాజ్ అహ్మద్ తలో వికెట్ పడగొట్టారు. అనంతరం భారత బ్యాటర్లలో వైభవ్ 53 బంతుల్లో 204 పరుగులు చేసి ఔటయ్యాడు. ఛేదించాల్సిన లక్ష్యాన్ని దాదాపు ఒక్కడే పూర్తి చేశాడు. అభిషేక్ శర్మ (12), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (3) తక్కువ పరుగులకే వెనుదిగిరారు. రింకూ సింగ్ 27, కుమార్ కుషాగ్ర 1 నాటౌట్‌గా నిలిచి 14.2 ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగించారు.

బౌల్ట్‌ను వదిలేసి అర్ష్‌దీప్‌ను తీసుకోవడం కరెక్టేనా?: ముంబయి ఇండియన్స్ మాస్టర్ ప్లాన్‌పై ఇర్ఫాన్ పఠాన్ విశ్లేషణ!



ఐపీఎల్ 2027 మినీ వేలానికి ముందు ముంబై ఇండియన్స్ తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయాలను టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ ఆసక్తికరంగా విశ్లేషించాడు. భారత యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ జట్టులోకి వచ్చిన తర్వాత న్యూజిలాండ్ స్టార్ పేసర్ ట్రెంట్ బౌల్ట్‌ను వదులుకోవడం సరైన నిర్ణయమేనని సమర్థించాడు. అయితే ఆఫ్ఘనిస్థాన్ యువ స్పిన్నర్ అల్లా ఘజన్‌ఫర్‌ను రిలీజ్ చేయడం మాత్రం తనను ఆశ్చర్యపరిచిందని జియోస్టార్‌తో మాట్లాడుతూ పఠాన్ పేర్కొన్నాడు.విదేశీ లెఫ్ట్‌ఆర్మ్ పేసర్ అయిన బౌల్ట్ స్థానంలో స్వదేశీ లెఫ్ట్‌ఆర్మ్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ జట్టులోకి వచ్చాడని, ఇది విదేశీ ఆటగాళ్ల కాంబినేషన్‌ను సరిదిద్దుకునేందుకు ముంబైకి ఎంతో వెసులుబాటు కల్పిస్తుందని పఠాన్ విశ్లేషించాడు. అలాగే తరచూ గాయాలపాలవుతూ పూర్తి సీజన్లు ఆడలేకపోతున్న పేసర్ దీపక్ చాహర్‌ను రిలీజ్ చేయడం కూడా అర్థం చేసుకోదగినదేనని స్పష్టం చేశాడు. కొత్త బంతితో వికెట్లు తీసే స్పెషలిస్ట్ బౌలర్ ఇప్పటికే జట్టులో ఉన్నప్పుడు చాహర్‌ను పక్కనపెట్టడం సరైన నిర్ణయమేనన్నాడు. కానీ, మిచెల్ శాంట్నర్‌తో కలిసి ఇరువైపులా విదేశీ స్పిన్ దాడి చేసేందుకు అల్లా ఘజన్‌ఫర్ సరైన ప్రత్యామ్నాయంగా ఉండేవాడని, అతడిని వదులుకోవడమే ఆశ్చర్యంగా ఉందని తెలిపాడు.ఈ మార్పులు చేసినప్పటికీ ముంబై బౌలింగ్ విభాగం ఇప్పటికే అత్యంత పటిష్ఠంగా కనిపిస్తోందని పఠాన్ అభిప్రాయపడ్డాడు. భారీ పర్స్ బ్యాలెన్స్‌తో వేలానికి వెళుతున్న ఐదుసార్లు ఛాంపియన్ ముంబై.. ఎప్పటిలాగే ఊహించని కొత్త టాలెంట్‌ను వెలికితీసి అందరినీ ఆశ్చర్యపరుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశాడు. పెద్ద బడ్జెట్‌తో మినీ వేలంలోకి అడుగుపెట్టిన ప్రతిసారీ ముంబై ఇండియన్స్ ఏదో ఒక అద్భుతం చేస్తుందని, ఈసారి వేలంలో ఫ్రాంచైజీ ఆ నిధులను ఎలా వినియోగిస్తుందో చూడటానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని పఠాన్ ముగించాడు.

బంతికి ఉమ్మి: శుభ్‌మన్ గిల్ విజ్ఞప్తిని తోసిపుచ్చిన ఐసీసీ!



అంతర్జాతీయ క్రికెట్‌లో బంతికి ఉమ్మి (సలైవా) వాడకంపై విధించిన నిషేధాన్ని ఎత్తివేసే ప్రసక్తే లేదని ఐసీసీ స్పష్టం చేసింది. ఈ నిబంధనను పునఃసమీక్షించాలని టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ చేసిన విజ్ఞప్తిని ఐసీసీ తోసిపుచ్చింది. ఆరోగ్యం, క్రీడాస్ఫూర్తికి సంబంధించిన ఆందోళనల నేపథ్యంలో ఈ విషయంలో తమ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండబోదని ఐసీసీ వర్గాలు 'ఇండియా టుడే'కు వెల్లడించాయి.వెల్లింగ్‌టన్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టు డ్రాగా ముగిసిన తర్వాత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఈ అంశాన్ని ప్రస్తావించాడు. బ్యాటింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై కూకబుర్రా బంతి త్వరగా మెత్తబడుతోందని, బౌలర్లకు ఏమాత్రం సహకరించడం లేదని గిల్ అసహనం వ్యక్తం చేశాడు. ఇలాంటి పరిస్థితుల్లో బంతికి ఉమ్మిని వాడేందుకు అనుమతిస్తే బౌలర్లకు కొంత ప్రయోజనం కలిగేదని అభిప్రాయపడ్డాడు. "కోవిడ్ కాలం ముగిసి చాలా ఏళ్లయింది. అయినా ఇప్పటికీ బంతిపై ఉమ్మిని ఎందుకు వాడనివ్వడం లేదో అర్థం కావడం లేదు" అని గిల్ వ్యాఖ్యానించాడు.అయితే, గిల్ వాదనను ఐసీసీ పరిగణనలోకి తీసుకోలేదు. 2020లో కోవిడ్-19 మహమ్మారి కారణంగా ఆటగాళ్ల ఆరోగ్య పరిరక్షణ కోసం ఈ నిషేధాన్ని తాత్కాలికంగా ప్రవేశపెట్టారు. ఆ తర్వాత దీనిని శాశ్వత నిబంధనగా మార్చారు. మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) నిబంధనల ప్రకారం కూడా బంతి స్వరూపాన్ని మార్చేందుకు ఉమ్మిని వాడటం అనుచిత ప్రవర్తన కిందకే వస్తుంది.ఉమ్మిని వాడటాన్ని పర్యవేక్షించడం కష్టమని, కొందరు ఆటగాళ్లు స్వీట్లు, చూయింగ్ గమ్ వంటి పదార్థాలతో కలిపి ఉమ్మిని బంతికి పూసి అక్రమంగా ప్రయోజనం పొందే ప్రమాదం ఉందని ఐసీసీ భావిస్తోంది. ఇది ఇప్పటికీ ఆటగాళ్లు, అంపైర్ల ఆరోగ్యానికి ముప్పు కలిగించే అంశంగానే చూస్తోంది.ఆసక్తికరంగా, ఐపీఎల్ 2025 సీజన్ నుంచి ఈ సలైవా నిషేధాన్ని ఎత్తివేసింది. అయితే, ఇది దేశీయ టోర్నీ కావడంతో దాని ప్రభావం అంతర్జాతీయ క్రికెట్‌పై ఉండదు. ఐసీసీ నిబంధనల్లో మార్పు తీసుకురావాలంటే, ఏదైనా సభ్య దేశం సంబంధిత కమిటీ ద్వారా ప్రతిపాదన చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం సలైవా బ్యాన్‌పై ఎలాంటి చర్చలు జరగడం లేదని, ఈ నిషేధం యథాతథంగా కొనసాగుతుందని ఐసీసీ స్పష్టం చేసింది.

విచిత్రంగా పోరుగున ఫేమస్ అయిన స్టార్లు







స్టైలిష్ బ్లూ డెనిమ్ జంప్‌సూట్‌లో మెరిసిపోయిన ఐషా శర్మ - ఫోటోషూట్

సొంత భాషలో ఆశించిన విజయాలు అందుకోకపోయినా ఇతర పరిశ్రమల్లో స్టార్‌డమ్ సంపాదించిన నటులు ఎందరో ఉన్నారు. దుల్కర్ సల్మాన్ తెలుగులో వరుస విజయాలతో క్రేజ్ తెచ్చుకోగా.. విశాల్, కార్తీ, ధనుష్, విజయ్ ఆంటోనీకి కూడా మంచి మార్కెట్ ఏర్పడింది. రానా, సుధీర్ బాబు హిందీలో గుర్తింపు పొందారు. రజనీకాంత్, అర్జున్, సుమన్ ప్రయాణాలూ భాషా సరిహద్దులు స్టార్‌డమ్‌కు అడ్డుకావని చాటుతున్నాయి.

భారతీయ సినీ చరిత్రలో సొంత భాషలో కంటే పొరుగు పరిశ్రమల్లో అడుగుపెట్టి తిరుగులేని క్రేజ్- స్టార్ ఇమేజ్ అందుకున్న నటులు ఎందరో ఉన్నారు. ఒక నటుడి ప్రతిభకు భాషా సరిహద్దులు అడ్డుకావని.. సరైన కథ, ప్రేక్షకుల ఆదరణ తోడైతే పరాయి గడ్డపైనా విచిత్రమైన రీతిలో అద్భుత విజయాలు సాధ్యమవుతాయని వీరి ప్రస్థానం నిరూపిస్తోంది. ప్రస్తుత తరంలో మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్ విషయంలో ఇది స్పష్టంగా కనిపిస్తోంది. మాతృభాష మలయాళంలో ఇటీవల వరుస పరాజయాలు ఎదురైనా తెలుగులో మాత్రం మహానటి, సీతారామం, లక్కీ భాస్కర్ వంటి చిత్రాలతో హ్యాట్రిక్ బ్లాక్‌బస్టర్లు అందుకుని .. లేటెస్టుగా -ఆకాశంలో ఒక తార-తో మరో బ్లాక్ బస్టర్ ఖాతాలో వేసుకుని టాలీవుడ్‌లో లోకల్ హీరోల స్థాయిలో ఫాలోయింగ్ సంపాదించుకున్నారు.ఇదే తరహాలో కోలీవుడ్ హీరోలైన విశాల్, కార్తీ, ధనుష్, విజయ్ ఆంటోనీ లకు తెలుగు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. గతంలో పందెంకోడి సినిమాతో విశాల్ తమిళం కంటే తెలుగులోనే విపరీతమైన క్రేజ్ తెచ్చుకోగా.. ఆ తర్వాత కూడా తమిళంలో ఫ్లాపులు వచ్చిన ప్రతిసారీ తెలుగు బాక్సాఫీస్ వద్ద విజయాలు అందుకున్నాడు. ఇక విజయ్ ఆంటోనీ నటించిన బిచ్చగాడు తమిళంలో సాధారణ విజయం సాధిస్తే... తెలుగులో మాత్రం సంచలన వసూళ్లతో అతడికి తిరుగులేని మార్కెట్‌ను సృష్టించింది. అదేవిధంగా ఊపిరి, ఖైదీ, సర్దార్ వంటి చిత్రాలతో కార్తీ తమిళం కంటే తెలుగులోనే ఎక్కువ ఆదరణ పొందగా.. ఇటీవల సార్, కుబేర వంటి సినిమాలతో ధనుష్ సైతం తెలుగులో తన మార్కెట్‌ను బలంగా విస్తరించుకుంటున్నారు. మరోవైపు.. తెలుగు పరిశ్రమకు చెందిన రానా దగ్గుబాటి, సుధీర్ బాబు వంటి హీరోలు ఉత్తరాదిన బాలీవుడ్‌లో తమదైన ముద్ర వేశారు. తెలుగులో హీరోలుగా కొనసాగుతూనే.. హిందీలో దమ్ మారో దమ్, బేబీ, ఘూజీ వంటి చిత్రాలతో రానా దగ్గుబాటి..

టైగర్ ష్రాఫ్‌తో కలిసి చేసిన -బాఘీ- సినిమాతో సుధీర్ బాబు దేశవ్యాప్తంగా గొప్ప గుర్తింపు, ప్రశంసలు అందుకున్నారు. వీరితో పాటు మహారాష్ట్రకు చెందిన సాయాజీ షిండే, మురళీ శర్మ వంటి విలక్షణ నటులు హిందీ, మరాఠీ చిత్రాల్లో నటించినా.. వారికి అసలైన గుర్తింపు.. స్టార్ క్యారెక్టర్ ఆర్టిస్ట్ హోదా దక్కింది మాత్రం తెలుగు సినిమాల ద్వారానే కావడం విశేషం.సీనియర్ తరం నటులను గమనిస్తే.. కన్నడ నేపథ్యం నుంచి వచ్చిన రజనీకాంత్, అర్జున్, సుమన్ వంటి దిగ్గజాలు కూడా ఇతర భాషల్లోనే తమ అసలైన స్టార్‌డమ్‌ను నిర్మించుకున్నారు. బెంగళూరులో కండక్టర్‌గా పనిచేసిన రజనీకాంత్ తమిళంలోకి అడుగుపెట్టి -సూపర్ స్టార్-గా ఎదిగితే... కర్ణాటకలో కెరీర్ ప్రారంభించిన అర్జున్ తమిళ, తెలుగు భాషల్లో జెంటిల్‌మన్, ఒకే ఒక్కడు వంటి చిత్రాలతో -యాక్షన్ కింగ్-గా మారారు. అలాగే మంగళూరుకు చెందిన సుమన్ సైతం తెలుగు ప్రేక్షకుల ఆదరణతో 80వ దశకంలో అగ్ర హీరోగా వెలుగొందారు.

సొంత గడ్డపై ఆశించిన స్థాయిలో కలిసిరాకపోయినా.. పొరుగు పరిశ్రమల ప్రేక్షకుల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న ఈ నటుల ప్రయాణం ఎంతో ఆసక్తికరం. ప్రతిభ, కష్టపడే తత్వం ఉంటే ఏ భాషలోనైనా ప్రేక్షకులు అక్కున చేర్చుకుంటారని.. భారతీయ సినిమాలో భాష కంటే భావోద్వేగమే ముఖ్యమని వీరి విజయగాథలు మరోసారి చాటిచెబుతున్నాయి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965